ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 27 ఏప్రిల్ 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0 (శనివారం)
కనిష్ఠం : 28

పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనులను వేగంగా పూర్తి చేస్తాం : మంత్రి జనార్దన్‌రెడ్డి 7

ఆదివారం ప్రత్యేకం

నోరూరే.. ఊరగాయ!





గ్రామంలో కుటుంబాలు : 1156 - పచ్చళ్ల తయారీ కుటుంబాలు : 800



పచ్చళ్ల పల్లెటూరు నార్కెడిమిల్లి



గోదారోళ్ల పచ్చళ్లు అంటే నోరూరాల్సిందే.. ఆ టేస్టే వేరు.. ఆ టేస్టే వేరు.. ఒకసారి తిన్నారా.. వదిలిపెట్టరు.. మళ్లీ మళ్లీ నోరూరిస్తోంది.. చూసిన వెంటనే లొట్టలేస్తారు.. అందుకే 60 ఏళ్లు అవుతున్నా ఆ ఊరి పచ్చడికి నేటికీ డిమాండ్ తగ్గలేదు.. ఎన్ని కంపెనీలు వచ్చినా ఆ ఊరు ఊరగాయకు ఏ మాత్రం డిమాండ్ తగ్గలేదు.. అంతకంతకూ పెరుగుతూనే ఉంది.. ఇంటికో పచ్చళ్ల పరిశ్రమ ఉంటుందంటే అతిశయోక్తి కాదేమో.. ఊళ్లో 1156 కుటుంబాలు ఉంటే 800 కుటుంబాలకు అదే ఆధారం. ఒకసారి పచ్చళ్ల పల్లెటూరు నార్కెడిమిల్లిని చూసొద్దామా..

- ఆత్రేయపురం -ఆంధ్రజ్యోతి

ఎక్కడో మారుమూల పల్లెటూరు.. పరిసర గ్రామాల ప్రజలకు పేరు చెప్పినా అదెక్కడ అంటూ ఆలోచిస్తారు.. అయితే దేశవిదేశాల్లో మాత్రం చాలా పెద్ద ఫేమస్.. ఎందుకంటే ఆ ఊరు పచ్చళ్లకు అంత డిమాండ్.. పూతరేకులకు ఆత్రేయపురం ఫేమస్ అయితే ఊరగాయలకు నార్కెడిమిల్లి ఫేమస్.. ఆ గ్రామంలో అడుగు పెట్టగానే ఏ ఇంట చూసిన పచ్చళ్ల డ్రమ్ములు.. బస్తాల్లో ముడి సరుకు.. నోరూరించే పచ్చళ్ల సువాసనలు వెదజల్లుతుంటాయి. వశిష్ఠ గోదావరి చెంతనే ఉన్న గ్రామం పచ్చళ్లకు ఎంతో ప్రసిద్ధిగాంచింది. సుమారు ఆరు దశాబ్దాల కిందట నుంచే ఇక్కడ పచ్చళ్లు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇళ్ల వద్దే కుటీర పరిశ్రమగా స్థాపించి అన్ని రకాల పచ్చళ్లు సీజన్ వారీగా నిత్యం తయారుచేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక్కడ తయారైన పచ్చళ్లు దేశంలో వివిధ ప్రాంతాలకు తీసుకుని వెళ్లి విక్రస్తుంటారు.

60 ఏళ్లుగా అదే వ్యాపారం..

ఆరు దశాబ్దాల కిందట పచ్చళ్ల తయారీ వెలసింది. నాడు సరదాగా ప్రారంభించిన పచ్చళ్ల వ్యాపారం నేడు ప్రతి ఇంటికీ ఉపాధిగా మారింది. ఆ ఊరులో ఏ ఇంటి ఎదుట చూసినా పచ్చళ్ల డ్రమ్ములు కనిపిస్తూనే ఉంటాయి. పచ్చళ్లలో ఎటువంటి రంగులు, రసాయనాలు లేకుండా తయారుచేయడం ప్రత్యేకత. కారం, ఉప్పు, ఇతర సామగ్రి హోల్‌సేల్‌గా కొనుగోలు చేసుకుని ఎండబెట్టి శుభ్రం చేసి ఎంతో శ్రద్ధగా నాణ్యత ప్రమాణాలతో పచ్చళ్లను తయారు చేస్తారు. అందుకే 60 ఏళ్లయినా నేటికీ నోరూరుతూనే ఉన్నాయి ఆ ఊరి పచ్చళ్లు.. తయారు చేసిన పచ్చళ్లను డ్రమ్ముల్లో నిల్వ చేసి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. అక్కడ వ్యాపారులు సైకిళ్లు, బైక్‌లు ద్వారా ఇంటింటికి వెళ్లి అమ్మకాలు సాగిస్తుంటారు. పట్టణ ప్రాంతాల్లో హోటల్స్‌కు కిలో రూ.150 నుంచి రూ.250 వరకు హోల్‌సేల్‌గా అందిస్తారు.



పచ్చళ్ల తయారీలో మహిళలు

- నాణ్యతకు పెట్టింది పేరు
- ఇతర రాష్ట్రాల్లో డిమాండ్
- పట్టణాలకు ఎగుమతులు
- సీజన్‌కు తగినట్టు పచ్చళ్లు
- ఆ ఊరుకు అదే ఆధారం



ఆవకాయ పచ్చడి ముక్కలు

ట్యాక్స్ మినహాయించాలి



నార్కెడిమిల్లి పచ్చళ్లను వివిధ రాష్ట్రాలకు తరలిస్తుంటాం. మధ్యలో సేల్స్ ట్యాక్స్ అధికారులు వేబిల్లులు పేరుతో ఇబ్బందులు కల్పిస్తున్నారు. సేల్స్ ట్యాక్స్ నుంచి విముక్తి కల్పించాలి.

- కొపెల్ల శ్రీరామ్, వ్యాపారి

రాయితీ రుణాలివ్వాలి..



చాలా ఏళ్లగా పచ్చళ్ల తయారీ జీవనాధారం. మాకు ముడి సరుకు కొనుగోలుకు రాయితీ రుణాలిస్తే మేమేంటో చూపిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ రుణాలు అందించి పరిశ్రమను ఆదుకోవాలి.

- మోటూరి షామిలి

నార్కెడిమిల్లి టూ..

నార్కెడిమిల్లిలో ఆడవాళ్లు ఏడాది పొడవునా సీజనల్ పచ్చళ్లను తయారు చేస్తుంటారు. ఆవకాయ, మామగాయ, నిమ్మకాయ, టమాటా, పండుమిర్చి, ఉసిరి, కాకరకాయ, అల్లం, చింతకాయ, దబ్బకాయ, బెల్లం ఆవకాయ, కరివేపాకు, గోంగూర, కారంపొడులను తయారు చేస్తుంటారు. మగవారంతా ఆ పచ్చళ్లను బెంగళూరు, చెన్నై, ఒడిషా, ముంబై, హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, వైజాగ్, రాయలసీమ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసి విక్రస్తుంటారు. ఎన్నో ఏళ్లగా వీరికిదే జీవనాధారం. గ్రామంలోని మగవాళ్లంతా ఈ పచ్చళ్లతో దేశవ్యాప్తంగా వ్యాపారాలు సాగిస్తారు. పండుగలు, ఎన్నికలు, శుభకార్యాలకు మాత్రమే గ్రామాలకు వస్తారు.

ఈనెలాఖరుతో ముగుస్తున్న

ఈకేవైసీ గడువు

సంక్షేమ లబ్ధి పొందాలంటే రేషన్‌కార్డుకు ఈకేవైసీ తప్పనిసరి

డీఎస్వో ఉదయభాస్కర్

అమలాపురం, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ నెల 30వ తేదీలోగా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి అడపా ఉదయభాస్కర్ తెలిపారు. లబ్ధిదారులను ఎలక్ట్రానిక్ పద్ధతిలో గుర్తించేందుకు వీలుగా ఈ ప్రక్రియ అమలులో ఉందని, రేషన్‌కార్డులో పేరు కలిగిన ప్రతీ ఒక్కరూ ఈకేవైసీ పూర్తి చేసుకుని నిరంతరాయంగా ప్రభుత్వ పథకాల లబ్ధిని, సంక్షేమ పథకాలను పొందాలని సూచించారు. రేషన్ షాపులు, మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ ఆపరేటర్లు, డిప్యూటీ తహశీల్దార్లు, తహశీల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయాల్లో ఈకేవైసీ చేయించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఐదేళ్లలోపు పిల్లల నుంచి 80 ఏళ్లలోపు వయసు దాటిన వారికి ఈకేవైసీ నుంచి మినహాయింపు ఉందన్నారు. రేషన్‌కార్డుల ఈకేవైసీకీ గడువు నాలుగు రోజులు మాత్రమే ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయితే సంక్షేమ పథకాల అర్హుల జాబితా గుర్తించవచ్చునన్నారు. వేలాది మంది విద్యార్థులు ఇతర ప్రాంతాల్లో చదువుకుంటూ ఉండడం, పరీక్షల వల్ల వారంతా ఈకేవైసీ పూర్తిచేసుకోలేకపోయారనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈనెల 30 వరకు గడువు పొడిగించిందని చెప్పారు. ఇటీవలకాలంలో అనేక మంది రేషన్‌కార్డుదారులు చనిపోయారని, వారి పేర్లను తొలగించలేదని, చాలా మంది చిరునామాలు మారిపోయాయని దీంతో అవన్నీ ఈకేవైసీ జరగలేదన్నారు. చిరునామా మారినప్పటికీ రేషన్ ఎక్కడ తీసుకుంటున్నారో అక్కడే చేయించుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. ఈ పాస్ యంత్రాల్లో పెండింగ్ ఉందని గమనిస్తే సభ్యున్ని పిలిచి వేలిముద్రలు వేయిస్తున్నారని, పక్క రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేసేవారు, విదేశాల్లో చదువుకుంటున్నవారి కోసం ఇప్పటిదాకా అవకాశం ఇచ్చామన్నారు. 2020లో కార్డులు పొందినవారి పిల్లల వయసు పదేళ్లు ఉంటుందని, వారంతా ఆధార్ బయోమెట్రిక్ చేసుకోవాలన్నారు.



మత్స్యకార భరోసా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేలు ఆనందరావు, బుచ్చిబాబు, కలెక్టర్ మహేష్‌కుమార్

మత్స్యకార భరోసా.. రూ.22.24 కోట్లు

- కలెక్టరేట్‌లో పరిహారం విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్ మహేష్‌కుమార్
- 11,123 మందికి లబ్ధి

అమలాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులు వేట విరామ సమయంలో ఇచ్చే పరిహారాన్ని రెట్టింపు చేసి ఒక్కో కుటుంబానికి రూ.20వేల వంతున అందిస్తున్న చంద్రబాబు కృషి అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో శనివారం 11,123 మంది మత్స్యకారులకు రూ.22 కోట్ల 24 లక్షల 60 వేల పరిహారాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా అమలాపురంలోని గోదావరి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు సహా పలువురు మత్స్యకార నేతలు మత్స్యకార భరోసా పంపిణీలో పాల్గొన్నారు. గతంలో ఉన్న రూ.10 వేల సాయాన్ని ఎన్నికల హామీ మేరకు రూ.20 వేలకు పెంచి మత్స్యకార భరోసాను అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. కొన్ని సాంకేతికపరమైన సమస్యల వల్ల అనర్హులుగా గుర్తించబడిన వారికి కూడా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు కోరారు. లబ్ధిదారుల ఎంపికలో ఎదురైన సమస్యలు పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో 344 మందిని అనర్హులుగా గుర్తించారని, డేటా ఎంట్రీలో సాంకేతికలోపం వల్ల ఏర్పడ్డ ఈ పరిస్థితిని పరిష్కరించాలని బుచ్చిబాబు కోరారు. కాట్రేనికోన మండలంలో 5583 మంది, మామిడికుదురులో 2070, ఐ.పోలవరం 1393, సఖినేటిపల్లిలో 1356, అల్లవరం 704, ఉప్పలగుప్తం మండలం 17 మంది వెరసి 11,123 మందికి రూ.22.24 కోట్ల చెక్కులను అందించారు. ఏటా మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఇచ్చే పరిహారాన్ని రెట్టింపుచేసి ఇవ్వడం మత్స్యకారులకు ఎంతో మేలు చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లకు మత్స్యకార నేతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారులకు సంబంధించిన సమస్యలను కొందరు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జేసీ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, మత్స్యశాఖ జేడీ పీవీ శ్రీనివాసరావు, మత్స్యకార నాయకుడు నాగిడి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అశోక్, ఎఫ్‌ఈవో గోపాలకృష్ణ పాల్గొన్నారు.



కరవాకలో సముద్రపు నాచును పెంచుతున్న చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్

నాచు సాగు పర్యావరణానికి మేలు: కలెక్టర్

మామిడికుదురు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): చెరువు ఆధారిత సముద్రపు (పాచి) నాచు సాగు వల్ల పర్యావరణానికి, వ్యవసాయ అనుబంధ రంగాలకు మేలు చేకూరుతుందని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. సీవీడ్ ఎనర్జీ అన్నది సముద్రపు నాచును పెంచే ఒక వినూత్న పద్ధతి అన్నారు. శనివారం మామిడికుదురు మండలం కరవాక తూర్పుపాలెంలో బీచ్ రోడ్డులోని సీవీడ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎకరం విస్తీర్ణంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఏర్పాటుచేసిన ఫాం పాండ్, ఫిష్ పాండ్‌లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. సముద్రపు నాచుతో అనేక ప్రయోజనాలు ఉంటాయని కలెక్టర్ అన్నారు. ఈ నాచు వల్ల ఆరోగ్యపరంగా, వ్యవసాయపరంగా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. దీనిద్వారా సేంద్రీయ ఎరువులు తయారై వ్యవసాయంలో నేలసారాన్ని, మొక్కల పెరుగుదలను పెంచడానికి దోహదపడతాయన్నారు. అలాగే మానవుని శరీరంలో పలు రకాల వ్యాధుల నివారణకు దీనిని ఉపయోగిస్తారన్నారు. ఔత్సాహిక రైతులు నాచును పండించడానికి ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అమలాపురం ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచార్యులు, డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య, ఉద్యానవనశాఖ, వ్యవసాయ, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



సఖినేటిపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవ, ఎంపీ హరీష్

రూ.1.30 కోట్లతో రోడ్డుకు శంకుస్థాపన

అంతర్వేది, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి తొమ్మిదిపేటల రోడ్డును ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎంపీ హరీష్ మాధుర్‌లు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.కోటి 35 లక్షల ఎంపీ నిధులతో 3.1 కిలోమీటర్ల పొడవునా ఈ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఇక్కడ పరిస్థితి ఇలానే ఉందని, ఎటువంటి అభివృద్ధి నోచుకోకుండా ఈ ప్రాంతం మారుమూల ప్రాంతాల్లా ఉన్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఈ రోడ్డును నెల రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని తెలిపాశారు. దీనికి సహకరించిన అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రూ.కోటి 35 లక్షలు ఎంపీ నిధుల నుంచి కేటాయించడం సామాన్య విషయంకాదని, ఆయన రుణం తీర్చుకోలేమన్నారు. ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గం అంటే ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు నిధులు మంజూరు చేశానన్నారు. గుండుబోగుల పెద్దకాపు, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, ముప్పర్తి నాని, తాడి మోహన్‌కుమార్, గొల్లమందుల చిట్టి, మల్లిబాబు పాల్గొన్నారు.

అందమైనది : హోప్‌ఐలాండ్



ఐ..హోప్ ఐలాండ్!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఆరేళ్లగా నిలిచిపోయిన సముద్రంలోని హోప్ ఐలాండ్ బోటు షికారు మళ్లీ మొదలుకాబోతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న పర్యాటకులకు అటవీశాఖ తీపికబురు అందించింది. కోరంగి అభయారణ్యం నుంచి హోప్ ఐలాండ్, కోరంగి నుంచి భైరవపాలెంలోని బ్రిటిష్ కాలం నాటి లైట్‌హౌస్‌కు రెండు వేర్వేరు రూట్లలో స్పీడ్ బోట్లు నడపాలని నిర్ణయించింది. ఇటీవల ట్రయల్ రన్ పూర్తి చేసి పర్యాటకుల కోసం బోట్లను రెండు రోజుల కిందట సిద్ధం చేసింది. రాజమహేంద్రవరం, దిండి వద్ద గోదావరిలో బోటు షికారుకు ఆదరణగా ఎక్కువగా ఉండడంతో త్వరలో కొత్తగా మరో మూడు స్పీడ్ బోట్లను కొనుగోలు చేసి తిప్పడానికి రాష్ట్ర పర్యాటకశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

- సాగరంలో పర్యాటకుల సరదా
- హోప్‌ఐలాండ్, లైట్‌హౌస్ షికారు
- రోజూ నాలుగు స్పీడ్ బోట్లు
- ఒక్కో బోటులో నలుగురు
- ఒక్కొక్కరికి టిక్కెట్ రూ.2,500
- రోజంతా విహారానికి రూ.10 వేలు
- త్వరలో ఆన్‌లైన్‌లో టిక్కెట్ల బుకింగ్
- కోరంగిలో నేరుగా టిక్కెట్ల సేల్స్

సీఎం చంద్రబాబు చొరవ

సీఎం చంద్రబాబు కొన్నినెలల కిందట అధికారులతో నిర్వహించిన సమీక్షలో హోప్‌ఐలాండ్‌కు బోటు షికారును ప్రారంభించాలనే దానిపై చర్చ జరిగింది. అటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా మంత్రిగా ఉండడం, ఎన్నికల సమయంలో హోప్‌ఐలాండ్ పర్యాటకంపై ఆయన హామీ ఇచ్చిన నేపథ్యంలో వేగంగా దీన్ని ప్రారంభించాలని అధికారులకు సీఎం సూచించారు. దీంతో రూ.2 కోట్లతో కొత్త బోటు కొనుగోలు చేయాలని అధికారులు భావించినా ఆచరణలోకి రాలేదు. కొన్ని వారాల కిందట ప్రభుత్వం అటవీశాఖను రంగంలోకి దించడంతో హోప్ ఐలాండ్‌కు బోటు షికారును ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తిచేసింది. తన వద్ద ఉన్న నాలుగు స్పీడ్ బోట్లకు ఇటీవల కొత్తగా ఇంజన్లను కొనుగోలు చేసి సిద్ధం చేసింది. ఇటీవల ట్రయిల్‌రన్ పూర్తి చేసి సర్వీసులు నడపానికి సిద్ధమైంది.

గోదావరిలో హాయ్‌హాయ్..

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కోనసీమ జిల్లాలోని దిండిలో పర్యాటకశాఖ ఎప్పటి నుంచో గోదావరిలో బోటు షికారు నిర్వహిస్తోంది. ఘాట్‌ల నుంచి ఇరవై నిమిషాలపాటు స్పీడ్ బోట్‌ల్లో పర్యాటకులను తిప్పుతున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో పర్యాటక శాఖ, ప్రైవేటువి కలిపి మూడు, దిండిలో ఒకటి ఉన్నాయి. వీటికి పర్యాటకుల నుంచి ఆదరణ అధికంగా ఉంటోంది. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో రోజుకు 700 మంది వరకు గోదావరిలో విహరిస్తున్నారు. పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో మరో మూడు స్పీడ్ బోట్లు కొనుగోలుకు పర్యాటక శాఖ నిర్ణయించింది. వీటిని రెండు రాజమహేంద్రవరం, ఒకటి దిండిలో తిప్పాలని భావిస్తోంది. ఒక్కో బోటు రూ.14 లక్షల ఖరీదు ఉంటుంది.

ఆరేళ్ల కిందట నిలిపివేత..

2019 సెప్టెంబర్‌లో గోదావరిలో కచ్చులూరు వద్ద బోటు ప్రమాదం నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వం హోప్ ఐలాండ్‌కు బోటు షికారును నిలిపివేసింది. పర్యాటకుల నుంచి ఒత్తిడి పెరగడంతో 2023లో హోప్ ఐలాండ్‌కు బోటు షికారు ప్రారంభించడానికి ఏపీటీడీసీ ప్రయత్నించింది. పాత బోటు మేజువాణిని తిరిగి ప్రారంభించడానికి సిద్ధపడింది. కానీ సముద్రంలో ప్రయాణించడానికి కావాల్సిన ఫిట్‌నెస్ లేకపోవడంతో బోటుకు కాకినాడ పోర్టు లైసెన్సు తిరస్కరించింది. కొత్త బోటు కొనాలనుకున్నా గత వైసీపీ సర్కారు పర్యాటకశాఖకు అనుమతివ్వలేదు. ప్రైవేటు పార్టీల ద్వారా 50 సీట్లతో బోటు షికారు ప్రారంభించడానికి ప్రైవేటు ఏజన్సీల నుంచి బిడ్లు ఆహ్వానించినా కార్యరూపం దాల్చలేదు.

కళ్లను కట్టిపడేస్తాయి..

కాకినాడ అంటే పర్యాటకులకు ఠక్కున గుర్తొచ్చేది హోప్ ఐలాండ్. సుమారు 200 ఏళ్ల కిందట సముద్రం మధ్యలో 16 కిలోమీటర్ల మేర సహజసిద్ధంగా ఏర్పడ్డ ఈ ద్వీపం కాకినాడను రక్షణ కవచంలా కాపాడుతోంది. ఈ ఐలాండ్ పర్యాటకులకు పంచే ఆనందం అంతా ఇంతా కాదు. దీన్ని చూడ్డానికి రెండు కళ్లూ చాలవు.అందుకే దూరప్రాంతాల నుంచీ వచ్చి పర్యాటకులు వాలిపోతారు. చుట్టూ నీలిసముద్రం.. నీటిపై తేలియాడుతూ కట్టిపడేసే మడ అడవులు ప్రకృతి ప్రియులకు మాటల్లో వర్ణించలేని అనుభూతి అందిస్తాయి.

టిక్కెట్ ధర రూ.2500

కోరంగి అభయారణ్యం నుంచి బయలుదేరే బోట్లు హోప్ ఐలాండ్‌కు ఒకరూట్, కోరంగి నుంచి భైరవపాలెంలోని బ్రిటిష్‌కాలం నాటి లైట్‌హౌస్ వద్దకు మరో రూట్ చొప్పున రోజు నాలుగు స్పీడ్‌బోట్లు నడవనున్నాయి. వాస్తవానికి చొల్లంగి వద్ద అభయారణ్యం నుంచి హోప్ ఐలాండ్‌కు బోట్లలో మూడు గంటలు పడుతుంది. స్పీడ్‌బోట్‌లో గంటన్నరలో వెళ్లవచ్చు.అటు బ్రిటిష్‌కాలంలో కోరంగికి నౌకలు రావడం కోసం భైరవపాలెంలో నిర్మించిన లైట్‌హౌస్ చూడ్డానికి ఎందరో ఇష్టపడతారు. ఈ రెండు మార్గాల్లో సముద్రంలో షికారుకు వెళ్లే పర్యాటకులకు టిక్కెట్ ఒక్కరికి రూ.2,500 చొప్పున నిర్ణయించారు. నలుగురు ప్రయాణించే ఈ స్పీడ్‌బోట్ ఒకసారి హోప్ ఐలాండ్, లైట్‌హౌస్‌కు వెళ్లి రావడానికి డీజిల్ రూ.6 వేలు అవుతుందని అధికారులు చెబుతున్నారు. అందుకే టికెట్ ధర రూ.2,500 చొప్పున నిర్ణయించామని తెలిపారు. ఈ స్పీడ్ బోట్‌లో సముద్రంలో నచ్చినచోటకు వెళ్లి రావడానికి రూ.10 వేలకు అద్దెకు ఇవ్వాలని అటవీశాఖ నిర్ణయించింది. పర్యాటకులే సొంతంగా డీజిల్ కొట్టించుకోవాలి. హోప్ ఐలాండ్ షికారుకు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకునేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. కోరంగి వద్ద ఆదివారం నుంచి టిక్కెట్లు విక్రయిస్తారు.

షికారు..

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కార్ల అమ్మకాలు
- ఖరీదైన కార్లకు యమా డిమాండ్
- కొత్త మోడళ్లపై పెరుగుతున్న మోజు









(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

కారులో షికారుకెళ్తే చాలా సౌకర్యంగా ఉంటుంది. ఇదివరకు కారు ఒక విలాసం. తర్వాత అవసరంగా మారింది. తర్వాత కారు ఉండడం సాధారణమైపోయింది. దాంతో ఏ బ్రాండ్ కారు వాడుతున్నారనేది ఒక హోదాగా మారింది. ఇప్పుడు ట్రెండ్ ఇదే. కారు ఉందా లేదా అనేది కాకుండా ఏ మోడల్ కారు వాడుతున్నారంటూ మాట్లాడుకునే రోజులు నడుస్తున్నాయి. ఇటీవల కాలంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కార్ల అమ్మకాలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనికి పైన చెప్పినవే కారణాలు కాదు.. యువతలో పెరుగుతున్న ఆసక్తి, వ్యాపారుల్లో పెరుగుతున్న మోజు, రాజకీయాల్లో ఉన్న ఆర్థికశక్తి, ప్రపంచంతో పెరుగుతున్న కనెక్టివిటీ, విలాసవంతమైన జీవితానికి భారతీయులు పడుతున్న ఆశ.. సంఘంలో గొప్పగా కనిపించాలనే అత్యాశ.. వంటి కారణాలూ కార్ల కొనుగోలుపైనా ప్రభావం చూపిస్తున్నాయి. దీంతోపాటు వృత్తిపరమైన వ్యాపారపరమైన అవసరాలకు కారు కచ్చితంగా కావాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కార్ల కొనుగోళ్లు, అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. లగ్జరీ కార్ల వినియోగంలోనూ మన ప్రాంతం దూసుకెళ్తోంది. అత్యాధునిక మోడల్ ఏదొచ్చినా కొనుగోలు చేయడానికి వాహన ప్రియులు సిద్ధంగా ఉంటున్నారు. ఏ కంపెనీ? ఏ సిరీస్? ఖరీదు ఎంత? భద్రత చర్యలు ఏంటి? ఇలా అనేక కోణాల్లో వాహనదారులు ఆరా తీస్తున్నారు. నచ్చితే లక్షలు దాటి కోట్ల వరకు విలువ చేసే కారైనా ఇట్టే కొనేస్తున్నారు. మహా నగరాల్లో విలాసవంతమైన కనిపించే కార్లు ఇప్పుడు మన ప్రాంతంలోనూ తరచు కనిపిస్తున్నాయి. ఈ తరహా విలాసవంతమైన వాహనాల అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. కనీసం రూ.10 లక్షలు మొదలుకొని కోట్ల విలువచేసే కార్లు అమ్ముడుపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో కార్ల కొనుగోళ్లు..

సంవత్సరం	అమ్మకాలు
2018	3198
2019	2749
2020	2316
2021	3350
2022	3194
2023	3540
2024	2980
2025 ఏప్రిల్ 26వరకు	939

ఇవన్నీ కొత్త కార్ల కొనుగోలుకు సంబంధించిన గణాంకాలు. ఈ గణాంకాల్లో 2024లో కొంత మేర కార్ల కొనుగోళ్లు తగ్గినా ఈ ఏడాది అత్యధికంగా కొత్త కార్ల కొనుగోళ్లు జరుగుతాయని రవాణా శాఖ అంచనా వేస్తోంది. దీనికితోడు పాత కార్ల అమ్మకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. మధ్య తరగతి వర్గంతోపాటు ఉద్యోగ వర్గం ప్రధానంగా కార్లను కొనుగోలు చేస్తుండడంతో ఆ మేరకు ఆయా అమ్మకాలు జరుగుతున్నాయని ఆ శాఖ అధికారులు తెలిపారు.

ఏఏ ధరల్లో ఎన్ని కార్లు కొనుగోలు చేశారు..

సంవత్సరం	10 లక్షల్లోపు	20 లక్షలు	30 లక్షలు	30 లక్షలకుపైగా
2022	966	690	99	20
2023	1652	1204	205	70
2024	1321	1065	203	64
2025 ఏప్రిల్ 26	466	370	62	41

లైఫ్ ట్యాక్స్‌తో భారీ ఆదాయం..

ఖరీదైన వాహనాలతో వచ్చే లైఫ్ ట్యాక్స్‌తోను రవాణాశాఖకు భారీ స్థాయిలో ఆదాయం సమకూరుతోంది. రూ.20 లక్షలు ఆపై విలువజేసే కార్లు 18 శాతం లైఫ్‌ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. బిజినెస్, పొలిటికల్ రంగాల ప్రముఖులు ఇతరులకు భిన్నంగా ఉండాలనే కాన్సెప్ట్, అందులో ఉండే భద్రతాపరమైన అంశాలతో ఎక్కువగా ఖరీదైన కార్లను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. రియల్ ఎస్టేట్, ఇతర కంపెనీల పేరుపై కూడా ఖరీదైన వాహనాలను కొనుగోలు చేస్తున్నారు.



లగ్జరీ కార్లకు ఆదరణ పెరిగింది



విలాసవంతమైన కార్లకు డిమాండ్ పెరిగింది. చాలామంది డబ్బులు ఎంతైనా వెచ్చించి నచ్చిన కార్లను కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా కంపెనీలు తమ వాహనాల్లో భద్రతాపరమైన ఫీచర్లను విభిన్న రకాలుగా అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ప్రమాదం జరిగినా తప్పించుకునే రక్షణ కల్పించే భద్రత వ్యవస్థ ఉన్న వాహనాలకు ఎన్ని కోట్లు అయినా వెచ్చిస్తున్నారు.

- శ్రీధర్, డీటీసీ, కాకినాడ జిల్లా

బండెనక బండి కట్టి...



ఈ చిత్రాన్ని చూస్తుంటే బండెనక బండి కట్టి అనే సినిమా పాట గుర్తుకొస్తోంది కదూ... కొన్ని ప్రాంతాల్లో పంట పొలాల నుంచి ధాన్యాన్ని తీసుకువచ్చేందుకు సరైన మార్గాలు, పంతరోడ్లు లేకపోవడంతో ధాన్యం తరలించాలంటే ఎడ్ల బండ్లే ఆధారం. శనివారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు, సీతానగరం పొలాల నుంచి ధాన్యాన్ని ఇలా ఎడ్ల బళ్లపై తరలిస్తుండగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. -గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి)

రావి ఆకులా...



కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో శనివారం వింత కీటకం దర్శనమిచ్చింది. రావి ఆకు మాదిరిగా ఉన్న ఇది గొల్లభామలా సంచరించింది. దీనిని పలువురు ఆసక్తిగా తిలకించారు.

- ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)

మామిడికి ఆర్గానిక్ కవర్ల రక్షణ



మధుర ఫలం మామిడి చెట్ల రక్షణకు రైతులు వినూత్నంగా ఆలోచించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రైతులు మామిడి కాయలు, పండ్లకు చీడపీడలు ఆశించకుండా వాటి చుట్టూ ఆర్గానిక్ కడుతున్నారు. బెంగళూరు నుంచి రూ.6వేలు విలువైన 3వేల కవర్లు కలిగిన ప్యాకెట్లను తెప్పించి వినియోగిస్తున్నారు. ఇవి మంచి ఫలితాలు ఇస్తున్నాయని ధర్మవరానికి చెందిన మామిడి రైతులు కొనగాల గోపి, వీరబాబు తెలిపారు.

- ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)

భక్తవత్సల గోవిందా.. గోవింద

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- స్వామివారి ఆదాయం రూ.56.53 లక్షలు





వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.56.53లక్షలు లభించినట్లు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

రసాయనాలతో పండ్లను మాగబెట్టి

విక్రయిస్తే కఠిన చర్యలు

- తూర్పుగోదావరిజిల్లా జేసీ చిన్నరాముడు




సదస్సులో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పండ్లను రసాయనాలతో మాగబెట్టి విక్రయిస్తే అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు హెచ్చరించారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మార్కెట్‌యార్డు సమీపంలో రైతులు, వినియోగదారులు, వ్యాపారస్తులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సహజసిద్ధంగా పండ్లను మాగబెడితే ప్రజల ఆరోగ్యానికి హాని కలగదని, దీనిపై రైతులు, వ్యాపారస్తులు ఆలోచన చేయాలని అన్నారు. కృత్రిమంగా కాల్షియం కార్బైడ్ వంటి హానికర రసాయనాలతో పండ్లను మాగబెట్టడంవల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. ఇలాంటి పండ్లు తినడంవల్ల శ్వాసకోశ వ్యాధులు, గుండెజబ్బులు, జీర్ణ సంబంధ సమస్యలు వస్తాయని అన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని అవగాహన చేసుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవాలని కోరారు. కృత్రిమ పద్ధతుల్లో పండ్లను మాగబెట్టే వారికి 6 నెలల జైలు, రూ.5 లక్షలు జరిమానా విధిస్తామన్నా.రు. జిల్లా ఆహారభద్రత అధికారి రుక్కయ్య మాట్లాడుతూ కృత్రిమంగా రసాయనాలతో పండ్లను మాగబెడితే వారి వ్యాపార లైసెన్సులను రద్దు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సునీల్‌వినయ్, జిల్లా ఉద్యాన అధికారి బి.సుజాతకుమారి, ఎంపీఐ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డెల్టా కాలువలు

మూసివేత



ధవళేశ్వరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):రబీ అనంతరం ఖరీఫ్ నాటికి పంట కాలువలను సిద్ధం చేయడానికి కాల్వలపై ఉన్న లాకులు, షట్టర్‌లు వంటి వాటికి మరమ్మతులు చేయడానికి వీలుగా డెల్టా కాలువలను నేటి నుంచి మూసివేసి జూన్‌లో ఖరీఫ్‌కు నీటిని విడుదల చేయనున్నారు. ఆదివారం ఉదయం నుంచి డెల్టా కాలువల నీటి విడుదలను క్రమంగా తగ్గిస్తూ సాయంత్రానికి హెడ్ స్లూయిస్‌ల గేట్లను పూర్తిగా దించివేసి నీటి విడుదలను నిలిపివేయనున్నారు. ప్రస్తుతం తూర్పుడెల్టాకు 300 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 700క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3వేల క్యూసెక్కులు విడుదలవుతున్నాయి.

శృంగారవల్లభస్వామికి నీరా'జనం'



పెద్దాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తొలి తిరుపతి క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీదేవి, భూదేవి సమేత శృంగారవల్లభస్వామిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి నిత్య కైంకర్యాలను అర్చకస్వాములు అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుమారు 15వేల మంది దర్శించుకోగా ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2.32,590, అన్నదాన విరాళాల ద్వారా రూ.58,073, కేశఖండన ద్వారా రూ.9,360, తులాభారాల ద్వారా రూ.700, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.22,395.. మొత్తం రూ.3,23, 118 ఆదాయం వచ్చిందని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేయగా నాలుగువేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

కొంగొత్త ఆవిష్కరణలకు వేదికగా ఇన్నోవేషన్ హబ్

- జేఎన్‌టీయూకేలో క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సదస్సు
- ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి



జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి

కాకినాడ (సర్పవరంజంక్షన్), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దడం, కొంగొత్త ఆవిష్కరణలకు వేదికగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించినట్లు ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. కె.మధుమూర్తి పేర్కొన్నారు. శనివారం కాకినాడ జేఎన్‌టీయూ ప్రాంగణంలోని అలూమ్ని ఆడిటోరియంలో యూసీఈకే కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) విభాగం ఆధ్వర్యంలో క్వాంటమ్ ఎకోసిస్టమ్స్ టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూఇటీసీఐ), నేషనల్ క్వాంటమ్ మిషన్ (ఎన్‌క్యూఎం)ల సంయుక్త సహకారంతో రెండురోజుల పాటు జరిగే అవగాహన సదస్సును క్యూఇటీసీఐ ఫౌండర్, సీఈవో రీనా దయాల్, వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్‌లతో కలసి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ అమరావతి కేంద్రంగా ఏర్పాటైన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు రాష్ట్రంలోగల అనంతపురం, తిరుపతి, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం నగరాల్లో ప్రముఖ పరిశ్రమలు స్పోక్స్ హబ్‌కు వ్యవహరిస్తాయన్నారు. క్వాంటమ్ అల్గారిథమ్‌వల్ల ట్రేడింగ్ స్ట్రాటజీలు, రిస్క్ అసెస్‌మెంట్, పోర్ట్ ఫోలియో మేనేజ్‌మెంట్‌ను ఆప్టిమైజ్ చేయడం ద్వారా మార్కెట్లలో గణనీయమైన ప్రయోజనం లభిస్తుందన్నారు. వాతావరణ నమూనాలను మెరుగుపరచడంతో పాటూ వాతావరణమార్పులను బట్టి మెరుగైన ఉపశమన, అనుసరణ వ్యూహాల అభివృద్ధి సహాయపడటంతో పాటూ ఇతర రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులతో భవిష్యత్‌కు మరింత మెరుగుపడుతుందన్నారు. ఎన్ఈపీ 2020కు అనుగుణంగా సాంప్రదాయ డిగ్రీ కోర్సులను ప్రొఫెషనల్ కోర్సులుగా రూపకల్పనచేసి క్వాంటమ్ కంప్యూటరింగ్, ఏఐ అండ్‌ఎంఎల్ పాఠ్యాంశాలు ఉండేలా నూతన పాఠ్యప్రణాళిక రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్యూఇటీసీఐ ఫౌండర్, సీఈ వో రీనాదయాల్ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా క్వాంటమ్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా వాస్తవ ప్రపంచంలో ముందున్న అవకాశాలపై నిపుణులు అవగాహన కల్పించడంతో పాటూ అనుభవాలను పంచుకుంటారన్నారు. పర్యావరణ వ్యవస్థకు మద్దతుగా క్వాంటమ్ ఎకో సిస్టమ్స్ టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పని చేస్తుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాలను పెంచవచ్చన్నారు. జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సాంకేతికత కాలంలో క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం అద్భుతమైన పురోగతి సాధిస్తోందన్నారు. దేశాన్ని క్వాంటమ్ టెక్నాలజీ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ముందంజలో ఉంచేందుకు ఉపయోడపడుతుందన్నారు. ఔషధ ఆవిష్కరణ, అంతరిక్ష పరిశోధన, బ్యాంకింగ్ భద్రత, సుస్థిరాభివృద్ధిలకు దోహదపడుతుందన్నారు. రతన్‌టాటా హబ్ ద్వారా రాబోయే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు ఏర్పాటయ్యేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, తద్వారా లక్ష మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయనారు. ఈ సందర్భంగా రీసోర్సు పర్సన్లు డాక్టర్ జేబీవీ రెడ్డి, డాక్టర్ సుందర్ బాలకృష్ణ, శంతనుశర్మ, జి.శ్యామ్‌సుందర్, సంతోష్‌కుమార్, డాక్టర్ అనిందిత బెనర్జీలు పవర్‌పాయింట్‌ప్రజెంటేషన్ ద్వారా అవకాహన కల్పించారు. కార్యక్రమంలో యూసీఈకె ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.మోహనరావు, ఐక్యూఏసీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.సుమలత, రెక్టార్ కేవీరమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వీ.రవీంద్రనాథ్, ఓఎస్ డీ ప్రొఫెసర్ కోటేశ్వరరావు, పలు విభాగాధిపతులు, జేఎన్‌టీయూకె, అనుబంధ కళాశాలలు, పలు రాష్ట్రాలలోని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



తైలాభిషేకాలకు బారులుతీరిన వేలాది మంది భక్తులు

శనిత్రయోదశికి పోటెత్తిన భక్తులు

- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.24.41లక్షలు

కొత్తపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):మందపల్లి శనేశ్వర(మందేశ్వర)స్వామివారి ఆలయానికి శనివారం తనిత్రయోదశి సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలకు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.24,41,386 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

రేపు డీఎస్సీ 2025 ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన కాపు అభ్యర్థులు (కాపు, బలిజ, తెలగ, ఒంటరి) లు డీఎస్సీ 2025 యస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లు కోసం ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో ఈనెల 28వ తేదిలోపు దరఖాస్తులు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు ఏ.శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు శనివారం ఒకప్రకటన విడుదలచేశారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈనెల 25 నుంచి స్వీకరిస్తున్నారని తెలిపారు. హెచ్‌టిటిపిఎస్://ఎండిఎఫ్‌సి.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు. అర్హతగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈనెల 28తో గడువు ముగుస్తుందని ఆయన తెలిపారు.

పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల
పనులను వేగంగా పూర్తి చేస్తాం

- రూ.1061 కోట్లతో గుంతల రహితంగా రాష్ట్రంలో రహదారులు
- ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- కాకినాడ జిల్లాలో పలుచోట్ల పర్యటన



కాకినాడ గేట్‌వే పోర్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

కాకినాడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని ఆర్అండ్‌బీ, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కాకినాడ జిల్లాలో పర్యటించారు. ముందుగా మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్‌ఆదిత్య, పోర్టు అధికారులు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జడ్పీ మాజీ ఛైర్మన్ జ్యోతుల నవీన్‌లతో కలిసి తొండంగి మండలం పెరుమాళ్లపురం వద్ద అరబిందో ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో జరుగుతున్న కాకినాడ గేట్‌వే పోర్టు పనులను, అనంతరం ఉప్పాడ తీరంలో ఫిషింగ్ హార్బర్ పనులను, కాకినాడ యాంకరేజ్ పోర్టులోని బార్జిల్లోకి లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కాకినాడ పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసేందుకు వచ్చామన్నారు. కాకినాడ గేట్‌వే పోర్టు లిమిటెడ్ 2018లో ఎంవోయూ చేసుకుందని, ఈ ప్రాజెక్టు ద్వారా మూడు బెర్తుల నిర్మాణం పూర్తి చేశామన్నారు. వీటిలో ఒక బెర్త్‌ను బొగ్గు కోసం, రెండు బెర్తుల ద్వారా ఇతర అవసరాలు తీర్చుకుంటున్నారని తెలిపారు.

పోర్టు పనుల పూర్తికి చర్యలు

2022లో ఈ ప్రాజెక్టు ప్రారంభం కాగా ఇప్పటివరకు 16 మిలియన్ మెట్రిక్ టన్నుల ఎగుమతులు చేస్తున్నారన్నారు. 2026 నాటికి ఈ పోర్టు అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పోర్టులో అరబిందో ఇన్‌ఫ్రా 74 శా తం వాటా, జీఎంఆర్ 26 శాతం వాటా ఉందని, ప్రభుత్వ రెవెన్యూ షేర్ వాటా 2.7 శాతమని తెలిపారు. ఈ మొత్తం ప్రాజెక్టు విలువ రూ2, 621 కోట్లు అని, ఇప్పటికే 28 శాతం పనులు పూర్తి చేశారన్నారు. మిగిలిన పనులు 2026 నాటికి పూర్తి చేయాలని ఒప్పందం ఉందన్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో హ్యాండ్లింగ్ సామర్థ్యం 4 ఎంఎంటీగా ఉందని, గతేడాది 3.88 ఎం ఎంటీ బియ్యం ఎగుమతులు జరిగాయన్నారు. 2023-24 సంవత్సరానికి ఈ పోర్టు ద్వారా రూ. 61కోట్లు ఆదాయం వస్తే నేడు మరో రూ.7 కోట్లు పెరిగిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.68 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సూచనల మేరకు రూ.1061 కోట్లతో గుంతల రహితంగా రహదారులను రాష్ట్రంలో తీర్చిదిద్దామన్నారు. మిగిలిన రోడ్లకు సంబంధించి పీపీపీ మోడల్ కింద అభివృద్ధి చేస్తామని తెలిపారు. మంత్రి పర్యటనలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మారిటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, ఛైర్మన్ దామచర్ల సత్య, మారిటైమ్‌బోర్డు సీఈ జీవీ రాఘవరావు పాల్గొన్నారు.

ఐదు నెలల్లో ఉప్పాడ హార్బర్ నిర్మాణం



ఉప్పాడ హార్బర్ డిజైన్‌ను పరిశీలిస్తున్న మంత్రి

కొత్తపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని ఐదు నెలల్లో పూర్తి చేసి చేసి మత్స్యకారులకు అంకితం చేస్తామని మంత్రి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పాడ- అమీనబాద్ మధ్యలో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్‌లో అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రికి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. వేట నిషేధ సమయంలో మత్స్య కారులకు రూ.20 వేలు పరి హారం చెల్లిస్తామన్న ఎన్నికల హామీని ముఖ్య మంత్రి నెరవేర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ జ్యోతుల నవీన్, జనసేన వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, దాసరి అర్జున్ ఉన్నారు.

తారస్థాయికి...
కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ వివాదం

గుంపులుగా చేరి తోపులాటలు



కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద సభ్యుల మధ్య వాగ్వాదం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో తలెత్తిన వివాదం తారస్థాయికి చేరింది. దీంతో శనివారం లారీ యార్డుకు పెద్ద సంఖ్యలో సభ్యులు చేరుకుని వాగ్వివాదానికి దిగారు. గుంపులుగా చేరి తోపులాటలకు దిగడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజీనామా చేసి చాంబర్ నుంచి వెళ్లిపోవాలని నినాదాలతో హోరెత్తించారు. పెద్ద సంఖ్యలో సభ్యులు బైఠాయించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని గుంపులను చెదరగొట్టి చాంబర్‌లో ప్రెసిడెంట్‌కు భద్రత కల్పించారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు నక్కా గీతాప్రసాద్, అడదాకుల రామకృష్ణయాదవ్, పైల శంకరరావు మీడియా తో మాట్లాడుతూ 6 దశాబ్దాల లారీ అసోసియే షన్ చరిత్రలో ప్రస్తుత కార్యవర్గం విధానాలతో పోర్టులో లారీలకు కిరాయి లేకుండా పోయిందన్నారు. ఈ కార్యవర్గం మీద విశ్వాసం లేదని మెజారిటీ సభ్యులు ముక్తకంఠంతో నినాదాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే కార్యవర్గంలోని ఇద్దరు వైస్ ప్రెసిడెంట్లు, సెక్రటరీ, ట్రెజరర్ రాజీనామా చేశారన్నారు. కార్యవర్గం లేకుండా అసోసియేషన్‌ను తానే నడుపుతానని ప్రెసిడెంట్ వాదించడం సరికాదన్నారు. దానిని సవరించు కుని సంఘ సభ్యుల ఆమోదంతో ప్రెసిడెంట్ అయితే తమకు అభ్యంతరం లేదన్నారు. 2014 నుంచి ఎమ్మెల్యేల సూచన మేరకు తమకు ఉపయోగపడే అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుంటామన్నారు. అసోసియేషన్‌లో పరిస్థితులను ప్రస్తుత ఎమ్మెల్యేకు అనేక పర్యాయాలు చెప్పినా పట్టించుకోలేదని, తమను కాదనుకుంటు న్నారో ఏమిటో తెలియట్లేదన్నారు. వన్‌టౌన్, పోర్టు పోలీస్ స్టేషన్ సీఐలు తమ సిబ్బందితో వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. దీంతో చాంబర్ నుంచి బయటకు వచ్చిన ప్రెసిడెంట్ దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని, ఆయన చెప్పిన విధంగా నడుచుకుంటామని చెప్పి యార్డు నుంచి వెళ్లిపోయారు. పోలీసులు వెళ్లిన అనంతరం స్టీరింగ్ కమిటీ సభ్యులు లారీల కిరాయి సీరియల్ కొనసాగించారు.

ఉపాధి కూలీల ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

తొమ్మిదిమందికి గాయాలు



రాజమహేంద్రవరంలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తనయుడు సంజీవ్

కొత్తపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శనివారం తెల్లవారుజామున ఉపాధి కూలీలతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో తొమ్మిది మంది గాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం చప్పిడివారిపాలానికి చెందిన గుబ్బల నాగలక్ష్మి, కుడుపూడి నాగమణి, ఇళ్ళ వెంకటలక్ష్మి, చప్పిడి గౌరి లక్ష్మి, పితాని సత్యవతి, చప్పిడి ధనమ్మ, మట్టపర్తి నాగలక్ష్మి, గుబ్బల లక్ష్మిలు ఉపాధి పని నిమిత్తం చప్పిడివారిపాలెం నుంచి అవిడి సత్తెమ్మ తల్లి ఆలయం వద్దకు ఆటోపై వెళ్తుండగా చప్పిడివారిపాలెం హైస్కూల్ మలుపు వద్దకు వచ్చేసరికి ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ఐదుగురికి స్వల్పగాయాలు కాగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్వలగాయాలైనవారిని అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన నలుగురిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తక్షణం వైద్యాన్ని అందించాలని వైద్యాధికారులతో మాట్లాడారు. గుబ్బల నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు.

పశ్చిమగోనగూడెంలో మూడు పూరిళ్లు దగ్ధం



దగ్ధమైన ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం పశ్చిమగోనగూడెం శెట్టిబలిజపేటలో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. నాలుగు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. విషయం తెలిసిన వెంటనే రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చారు. టేకుమూడి మహాలక్ష్మి ఇంట్లో ముగ్గురు దివ్యాంగులు, ఒనుం నాగు, ఒనుం శ్రీనులు అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయారు. ఘటనాస్థలం పక్కనే అద్దెకు ఉంటున్నవారి ద్విచక్రవాహనం కూడా పూర్తిగా దగ్ధమైంది. రెండు అగ్నిమాపక వాహనాలు మంటలను అదుపుచేశాయి. స్థానికుల సాయంతో అతికష్టం మీదప్రాణాలతో బయటపడ్డారు. వారంతా కూలి పనే జీవనాధారం. బాధితులందరికీ ప్రభుత్వం తరుపున నష్టపరిహారాన్ని అందించే ఏర్పాటు చేస్తామని, ఇళ్లు నిర్మించడానికి లోన్లు ఇప్పిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. తక్షణ సహాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున రూ.40వేలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మి సరోజ వీరగణేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, జనసేన నాయకులు అడ్డాల శివ, బదిరెడ్డి దొర, మాజీ సర్పంచ్ కుంచు చల్లారావు, బొమ్ముల గంగరాజు, మేడిశెట్టి రాంబాబు అధికారులు ఉన్నారు. అలాగే జనసేన పార్టీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి బాధిత కుటుంబాలకు చీరలు, దుప్పట్లు అందజేశారు.

మాదక ద్రవ్యాలతో కుటుంబాలు నాశనం

సెంట్రల్ జైలు ఖైదీలకు 'ఈగల్' ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతినడమే కాకుండా, కుటుంబాలు నాశనమవుతాయని అడిషనల్ ఎస్పీ (పరిపాలన) ఎన్‌బీఎం మురళీకృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) ఆధ్వర్యంలో నిషేధిత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, అలవాటును మానుకొనే పద్ధతులపై శనివారం ఖైదీలకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నగా, స్నేహితుల ప్రోద్బలంతో మొదలు పెట్టి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారన్నారు. బతుకులను బుగ్గిపాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సులభంగా డబ్బు సంపాదన కోసం చట్ట వ్యతిరేక మార్గాలను ఎంచుకుంటున్నారని, అలాంటి వాళ్లు ఏనాటికైనా శిక్ష అనుభవించకతప్పదని ఎన్నో ఘటనలు రుజువు చేశాయన్నారు. మాదక ద్రవ్యాల కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న వాళ్లు. విడుదలై వెళ్లిన తర్వాత తాము అనుభవించిన కష్టాలను, కుటుంబంతో గడపకుండా కోల్పోయిన జీవితాన్ని సమాజానికి తెలియజేయాలన్నారు. మాదక ద్రవ్యాల వల్ల యువత నాశనం అవుతుందని జిల్లా ఎక్సైజ్ అధికారి లావణ్య అన్నారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మనసు ఎప్పుడూ మన ఆధీనంలో ఉంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండొచ్చని జిల్లా అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పీఎస్ రాహుల్ అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డీఎడిక్షన్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందించే ఉచిత వైద్యం పొంది కోలుకోవచ్చన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల సూచనలతో విస్తృతంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తమ అనుభవాలను ఖైదీలు కొందరు స్వయంగా సదస్సులో వివరించారు. విడుదలైన తర్వాత వాటి జోలికి వెళ్లబోమని, అలవాటు ఉన్నవారిని మంచిగా మారే విధంగా చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సుబ్బరాజు, డీఎస్.రత్నరాజు, జైలు ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

వైభవంగా తలుపులమ్మ జాతర

- నమూనా ఆలయంలో పూజలు
- సాంస్కృతిక కార్యక్రమాలు, కేరళ నృత్యాలు



ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ



జాతరలో కేరళ నృత్యాలను ప్రారంభిస్తున్న ఈవో

తుని రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో గంధ అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారి వార్షిక జాతర వైభవంగా జరిగింది. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర వేడుకల్లో శనివారం చివరిరోజున పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. లోవ దిగువన లోవ కొత్తూరు గ్రామంలో నిర్వహించే ఈ వేడుకను పురస్కరించుకుని నమూనా ఆలయంలో అమ్మవారికి ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కేరళ నృత్యాలను లోవ దేవస్థానం ఈవో విశ్వనాథరాజు ప్రారంభించారు. వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా రూరల్ సీఐ చెన్నకేశవ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం లోవ కొత్తూరు గ్రామంలో అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈవో తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వివరించారు.

పాస్టర్ ప్రవీణ్ ఘటనపై మే 24న సభ

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల సంఘటనపై వచ్చే నెల 24న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కొంతమూరు సమీపంలోని ప్రకృతి వనం వద్ద మైదానంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో శనివారం విలేకర్లతో మాట్లాడారు. తాను మొదట్నుంచి పాస్టర్ ప్రవీణ్ పగడాలది ప్రమాదం కాదు హత్య అని చెబుతున్నానన్నారు. హైకోర్టులో తాను పిల్ వేశానన్నారు. ఈ సభకు కేఏ పాల్, పాస్టర్ ప్రవీణ్ పగడాలకుటుంబీకులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

అంతర్వేది, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలో శుక్రవారం రాత్రి పోతురాజు లక్ష్మీనరసింహారావు (చిన్నా) (43) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అయ్యప్పస్వామి మాలధారణలో ఉన్న లక్ష్మీనరసింహారావు తన స్వగృహంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పరిశీలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె. దుర్గాశ్రీనివాస్ తెలిపారు.

దిండిలో...

మలికిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం దిండిలో రొయ్యల చెరువు వద్ద విద్యుత్ షాక్‌తో రామరాజులంకకు చెందిన పున్నం నాగమావుళ్లు (32) శుక్రవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

మోటారు సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

రాయవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడిచి వెళ్తున్న వ్యక్తిని మోటారు సైకిలిస్టు ఢీకొనడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి అనపర్తి మండలం పులుగుర్త గ్రామానికి చెందిన పల్లెటి రాజు(50) మాచవరం సెంటర్ నుంచి పులుగుర్త వైపునకు నడిచి వెళ్తుండగా మోటారు సైకిలిస్టు వెనుక నుంచి ఢీకొనడంతో రాజు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న రాయవరం ఎస్ఐ క్షతగాత్రుడిని 108లో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. మృతుడు సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

'ఆత్మహత్య చేసుకుంటాం'



మాట్లాడుతున్న బాలమ్మ దంపతులు

దేవీపట్నం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్యాకేజీ ఇప్పించకపోతే రంపచోడవరం అంబేడ్కర్ సెంటర్‌లో ఈనెల 28న ఎండ్రిన్ తాగి చనిపోతామని దేవీపట్నం మండలం ఏనుగులగూడెం గ్రామానికి చెందిన సుండం బాలమ్మ, ఆమె భర్త అబ్బాయిదొర పేర్కొన్నారు. శనివారం బాలమ్మ మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్యాకేజీ కోసం ఏడేళ్లుగా దేవీపట్నం తహశీల్దార్ కార్యాలయం, ఐటీడీఏ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఈనెల 21న స్పందనలో సబ్ కలెక్టర్ కల్పశ్రీని కలవగా పెళ్లి అయిన కారణంగా ప్యాకేజీ రాదని, మూగదానివి అయితే నాకేంటీ ఇది గవర్నమెంట్ జీవో నువ్వు ఏం చేసుకుంటావో చేసుకోమని తనను తక్కువ చేసి మాట్లాడారని ఆరోపించింది. సబ్ కలెక్టర్ మాటలకు బాధ కలిగి తాము చనిపోవడానికి సిద్ధపడ్డామని, మా చావుకి కారణం రంపచోడవరం సబ్ కలెక్టర్, రెవెన్యూ అధికారులేనని ఆదంపతులు తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల విజేత 'విశాఖ'



ఫైనల్‌లో తలపడుతున్న విశాఖ, కడప జట్లు



విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న దృశ్యం

తొండంగి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం యల్లయ్యపేటలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచింది. గ్రామంలో కాశిదేవమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మెరైన్ రాకెట్స్ యూత్ ఆధ్వర్యంలో ఇన్విటేషన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ నెల 24 నుంచి జరిగిన పోటీల్లో 11 జట్లు పాల్గొన్నాయి. శనివారం తుదిపోరులో విశాఖపట్నం, కడప జట్లు తలపడగా విశాఖ విజేతగా నిలిచింది. కడప జట్టు రన్నర్‌తో సరిపెట్టుకోవలసి వచ్చింది. విజేత జట్టుకు కోడ వెంకటరమణ, కోడా అప్పలరాజు, చొక్కా రాజు సంయుక్తంగా ప్రకటించిన రూ.30వేల నగదుతో పాటు ట్రోఫీని అందించారు. రన్నర్‌కు రూ.20వేల నగదుతో పాటు ట్రోఫీని బహూకరించారు. టీడీపీ జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోడ వెంకటరమణ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందించారు. కాశిదేవమ్మ ఆలయ కమిటీ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668

AJD:207824

అమ్మకం కలవు

రాజమండ్రి రూరల్ కోలమూరు మెయిన్ రోడ్డు లో 290 (27X97) W/F స్థలం మరియు కొంతమూరులో 2,3 BHK బిల్డింగ్స్ మరియు అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్స్ అమ్మకం కలవు సెల్: 9014468992

AJD-

రియల్ ఎస్టేట్

వేగంగా అభివృద్ధి చెందుచున్న ఆంధ్రప్రదేశ్‌లో మల్లవల్లి ఇండస్ట్రియల్ హబ్ (హనుమాన్ జంక్షన్ దగ్గర) సమీపంలో ఇన్‌స్టాల్‌మెంటులో ప్లాట్లు కలవు సంప్రదించండి: 94 94 44 12 19

AJB- 235063

4 Lines CLASSIFIED Rs.230/- Only

సత్యసాయి గురుకుల పాఠశాలకు విజనరీ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

రాజమహేంద్రవరం, ఏ ప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉచిత విద్య, మానవతా విలువలకు ప్రాధాన్యమిస్తూ ఎన్నో ఏళ్లుగా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్రీ సత్యసాయి గురుకుల పాఠశాల మోస్ట్ ప్రామిసింగ్ అండ్ విజనరీ స్కూల్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు సాధించిందని కరెస్పాండెంట్ అయోధ్యుల శ్యామసుందర్, ప్రిన్సిపాల్ కె.గురయ్య శనివారం తెలిపారు. బెంగళూరులో ఈ నెల 25న అవార్డును స్కూల్ తరఫున తాను అందుకున్నానని గురయ్య పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషితో సాధించిన ఉత్తమ ఫలితాలు ఇలాంటి ఉన్నతమైన అవార్డులను తీసుకురావడంలో దోహద పడుతున్నాయని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ గురయ్య

దొంతికుర్రు మహిళకు 'గిన్నిస్' ధ్రువపత్రం

కాట్రేనికోన, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం దొంతికుర్రుకు చెందిన సంసాని దివ్యస్వరూప కీబోర్డు ప్రదర్శనలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి ధ్రువపత్రం అందుకున్నారు. విజయవాడ హలేల్ సంగీత పాఠశాల ఆధ్వర్యంలో గతేడాది ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన ప్రపంచ స్థాయి కీబోర్డు సంగీత ప్రదర్శనలో దివ్యస్వరూప పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 18 దేశాలకు చెందిన 1046మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి గిన్నిస్ బుక్‌లో చోటు దక్కడంతో పాల్గొన్న వారందరికీ ధ్రువపత్రాలు లభించాయి. సంగీత పాఠశాల ప్రతినిధులు దివ్యస్వరూపకు ధ్రువీకరణపత్రం అందించారు.



ధ్రువపత్రం అందుకుంటున్న దివ్యస్వరూప



వేములమ్మకు బోనాలు

రౌతులపూడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గంధామావాస్య పండుగను పురస్కరించుకుని కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం బీబీపట్నంలో గ్రామదేవత అయిన వేములమ్మవారికి శనివారం సాయంత్రం మహిళలు బోనాలు సమర్పించారు.

గుబ్బాలమ్మకు 8 కిలోల వెండి కిరీటం

కిర్లంపూడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త సంపర సుధాకర్ గుబ్బాలమ్మ తల్లికి జాతర సందర్భంగా రూ.10లక్షలు విలువైన 8 కిలోల వెండి కిరీటం చక్రాన్ని బహూకరించారు. వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి కిరీటాన్ని అమర్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల వెంకటేష్, గుడాల రాంబాబు, గ్రామపెద్దలు ఉన్నారు.



అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని శనివారం కాకినాడకు చెందిన చిట్టూరి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అన్నప్రసాద ట్రస్టుకు రూ.10,116 విరాళం అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం

మామిడికుదురు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధి సమీపంలో ఎంపీ నిధులు రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు.

టీడీపీ పాలనలో గ్రామాలకు రోడ్లు, తాగునీరు: ఎమ్మెల్యే


బోడసకుర్రులో మంచినీటి ట్యాంకు ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి, ఇంటింటికీ తాగునీరుఅందిస్తున్నామని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బోడసకుర్రు న్యూహౌసింగ్ కాలనీలో రూ.57.19లక్షల ఆర్‌డబ్ల్యుఎస్ నిధులతో నిర్మించిన ఓహెచ్‌ఎస్సార్ ట్యాంకు, మంచినీటి కుళాయిలను ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. జలజీవన్ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలుచేసి అందరికీ తాగునీరు అందించాలని, బోడసకుర్రుపాలెంలో విద్యుత్ లోఓల్టేజ్ సమస్య, డ్రైన్స్, శ్మశానవాటిక తదితర సమస్యలు తీర్చాలని సర్పంచ్ రాక్కొల విజయలక్ష్మి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సుముఖత వ్యక్తం చేశారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, బొర్రా ఈశ్వరరావు, అధికారి జయవెంకటలక్ష్మి, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, అడపా వెంకటేశ్వరరావు, పచ్చిమాల ఏడుకొండలు, ముత్యాల బాబి, ఓలేటి పరమేశ్వరరావు, రేళ్ల శ్రీనివాస్, రొక్కాల నాగేశ్వరరావు, దొమ్మేటి రామకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జి.స్వామి పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ నియామకంలో కుదరని ఏకాభిప్రాయం

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం


నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కౌన్సిల్ నియామకంలో తెలుగుదేశం, వైసీపీ పార్టీల కౌన్సిలర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది. చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో గత కౌన్సిల్ సమావేశంలో వాయిదా పడిన స్టాండింగ్ కమిటీ నియామకం అజెండాలో రెండో అంశంగా ప్రవేశపెట్టగా, బార్ కౌన్సిల్ నుంచి వచ్చిన నాలుగు పేర్లలో కోన వెంకటశ్రీనివాసరావు పేరును వైసీపీ కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ ప్రతిపాదించగా వేటుకూరి బోసు రాజు బలపరిచారు. అయితే దాసరి సత్యనారాయణ పేరును ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సిఫార్సు చేశారని, దాసరి పేరును అంతా బలపరచాలని ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ ప్రతిపాదించగా దానిని తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్ బలపరిచారు. అయితే వైసీపీ కౌన్సిలర్ మాత్రం కోన వెంకటశ్రీనివాసరావు పేరునే ప్రతిపాదించడంతో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు ములపర్తి బాలకృష్ణ, అడబాల సతీష్‌కుమార్‌లు స్టాండింగ్ కౌన్సిల్ నియామకంలో చైర్మన్ అభిప్రాయం చెప్పాలని కోరగా మెజార్టీ కౌన్సిలర్ల అభిప్రాయమే తన అభిప్రాయమని చెప్పడంతో కమిషనర్ పి.రవివర్మ ఓటింగ్ నిర్వహించారు. పది మంది వైసీపీ కౌన్సిలర్లు కోన వెంకటశ్రీనివాసరావు పేరును సూచించగా తెలుగుదేశం పార్టీ ఆరుగురు కౌన్సిలర్లు దాసరి సత్యనారాయణ పేరును సూచించారు. దీంతో చైర్మన్ ప్రవీణ్‌కుమార్ కౌన్సిల్ తీర్మానాన్ని ఎమ్మెల్యే ముందు ఉంచాలని సూచించడంతో కమిషర్ రవివర్మ కౌన్సిల్ తీర్మానం విషయం ఎమ్మెల్యే ముందు ఉంచి స్టాండింగ్ కౌన్సిల్ నియామకం ప్రకటిస్తామని పేర్కొన్నారు. అనంతరం నగర పంచాయతీ సమస్యలపై చర్చ జరిగింది. 216జాతీయ రహదారి పక్కన వెంచర్లు వేస్తున్నారు. తాగునీటి, మురుగునీటి బోదెలను ఆక్రమించి కట్టేస్తున్నారు. ల్యాండ్ కన్వర్షన్ లేకుండా ఇష్టానుసారంగా లేఅవుట్లు వేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ సమావేశంలో అధికారులకు సూచించారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ పవన్‌కుమార్ కాల్వల నిర్వహణ మాత్రమే తమ పరిధిలోనికి వస్తుందని, రెవెన్యూ బోదెలు తమ పరిధిలోకి రావని సమాధానం ఇచ్చారు. అవుట్‌లెట్ల ఆక్రమణల తొలగింపు సమస్యను డిప్యూటీ తహశీల్దార్ గోపాలకృష్ణ ముందు ఉంచారు. పంట బోదెలు, మురుగునీటి బోదెలు ఆక్రమణల తొలగింపు విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్, డ్రైన్స్ శాఖల అధికారులు పరస్పర సహకారం అందిస్తే సమస్య పరిష్కారమవుతుందని, ఆ దిశగా సహకారం అందించాలని కమిషనర్ రవివర్మ కోరారు. హైవే ప్రధాన కూడళ్లలో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే దీనిపై 250మంది సంతకాలు చేసి హైవే అధికారులకు వినతిపత్రం ఇచ్చారని ములపర్తి బాలకృష్ణ పేర్కొన్నారు. దీనిపై హైవే అధికారులకు సమస్యను నివేదించాలని చైర్మన్ ప్రవీణ్‌కుమార్ కమిషనర్ రవివర్మను ఆదేశించారు. అనుమతులు లేకుండా అక్వా చెరువులు తవ్వేస్తున్నారని ఆ మట్టిని ట్రాక్టర్లతో తరలించడంలో రోడ్డుపై ట్రాక్టర్లు ఇష్టానుసారంగా నడుపుతున్నారని, దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ములపర్తి బాలకృష్ణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. చైర్మన్ స్పందించి మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ గోపాలకృష్ణకు సూచించారు. ప్రభుత్వ భూముల్లో ప్లానింగ్ అప్రూవల్ లేకుండా ఇళ్లు నిర్మించుకున్న వారికి అధికంగా అనధరైజ్డ్ పన్ను విధిస్తున్నారని, దీని వల్ల అది వారికి భారం అవుతుందని, పన్నుల విధింపులో వెసులుబాటు కల్పించాలని కౌన్సిల్ అడబాల సతీష్‌కుమార్ నగర పంచాయతీ ఆర్‌ఐ భాస్కరరావుకు సూచించారు. దీనిపై ఆయన స్పందించి త్వరలోనే ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోబోతుందన్నారు. సమావేశంలో ప్రారంభ నిల్వతో కలుపుకుని వివిధ పద్దుల కింద రూ.33,75,595 జమలుగాను, వివిధ పనులకు సంబంధించి రూ.17,97,661 ఖర్చులుగాను చూపుతూ ముగింపు నిల్వ రూ.15,77,934గాను రెండో పద్దు కింద ప్రారంభ నిల్వతో కలిపి రూ.61,50,862 జమలుగాను, వివిధ పనులకు సంబంధించి రూ.37,92,138 ఖర్చుగాను రూ.23,58,724 ముగింపు నిల్వగా ప్రవేశపెట్టిన తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేసిన సంఘటనపై మృతిచెందిన వారికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపాన్ని వ్యక్తంచేసింది. సమావేశంలో వైస్‌చైర్మన్ వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


పేరూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న సమగ్రశిక్ష ఏఎంవో రాంబాబు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు పేర్కొన్నారు. పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన అటల్ బూట్ సమ్మర్ క్యాంపు శనివారంతో ముగిసింది. పాఠశాల హెచ్‌ఎం కేఏఆర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో రాంబాబు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్, గేమింగ్ ప్రోగ్రాం, రోబోటిక్ టెక్నాలజీపై విద్యార్థులకు మూడు రోజులు శిక్షణ ఇచ్చామన్నారు. అటల్ హబ్ పాఠశాలలతో పాటు పుల్లేటికుర్రు, అంబాజీపేట, గొల్లవిల్లి, జి.వేమవరం, అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల స్పోక్స్ స్కూల్స్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో ఉన్న 45అటల్ స్కూల్స్ పాఠశాల ఉపాధ్యాయులకు ఒకరోజు వర్కుషాపు నిర్వహించనున్నట్టు రాంబాబు తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన లైన్ ఫాలోయింగ్ రోబోటిక్ పోటీల్లో గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ఉపాధ్యాయులు సర్టిఫికెట్లు అందజేశారు. ట్రైనర్లు పి.నరేష్, స్వాతిప్రియ, ఉపాధ్యాయులు బీవీ గౌరీప్రసాద్, మోడల్ ఇన్‌చార్జిలు కె.పద్మావతి, కె.పావని, ఎం.సీతామహాలక్ష్మి, ఎ.రామకృష్ణ, యూవీరావు, డీవీ నారాయణ, బీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

తాగునీరిప్పించండి మహాప్రభో..
అధికారులకు దళితుల వినతి


సమస్యలపై ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న పేరాయిచెరువు, దేవీనగర్ వాసులు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తాగునీరు అందడం లేదని, విద్యుత్ సరఫరా సక్రమంగా లేదంటూ ఉప్పలగుప్తం పంచాయతీ పేరాయిచెరువు, దేవీనగర్ దళితులు శనివారం పంచాయతీ కార్యదర్శి, ట్రాన్స్ కో ఏఈ, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఏటిమెరకలో ఉన్న వాటర్ ట్యాంకు ద్వారా తమ ప్రాంతాలకు తాగునీరు అందడంలేదన్నారు. నీటి కోసం కుళాయిల వద్ద నాలుగు మీటర్ల లోతున గోతులు తవ్వినా నీరు రాక ఇక్కట్లు పడుతున్నట్టు అధికారుల వద్ద వాపోయారు. చుట్టూ రొయ్యల చెరువుల కారణంగా బావులు తవ్వినా ఉప్పునీరే రావడంతో తాగునీటి కోసం నానా పాట్లు పడుతున్నామన్నారు. ఈ ప్రాంతంలోని 200 కుటుంబాలు తాగునీటి కోసం ఆరు కిలోమీటర్లు వెళ్లవలసి వస్తోందని వివరించారు. ఇక కరెంటు ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలియని అయోమయ పరిస్థితి ఉందన్నారు. కరెంటు పోతే సమస్య పరిష్కారానికి కనీసం ఒక రోజు పడుతోందని అన్నారు. విద్యుత్ వైర్లు శిథిలావస్థకు చేరడంతో తరచూ తెగిపోయి రోజుల తరబడి చీకట్లోనే ఉంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలంటూ అధికారులను అభ్యర్థించారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలంటూ ర్యాలీ

మామిడికుదురు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలంటూ మామిడికుదురు, మగటపల్లి గ్రామాల్లో శనివారం కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా అంతమొందించాలని కోరారు. దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఆయా కుటుంబాల వారికి సానుభూతి తెలిపారు. మగటపల్లిలో జరిగిన ర్యాలీలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, బొలిశెట్టి జయరామ్, బాషా మాష్టారు, గౌస్ మొహిద్దీన్, మామిడికుదురులో రుద్ర శ్రీను, నయినాల శ్రీరామ్, మెండా వెంకటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు యానాంలో అసిస్టెంట్ రాత పరీక్ష

5 సెంటర్లు, 1,705మంది అభ్యర్థులు

యానాం, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): యానాంలో ఆదివారం అసిస్టెంట్ రాతపరీక్ష జరుగుతుందని యానాం పరిపాలనాధికారి మునిస్వామి తెలిపారు. పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి పుదుచ్చేరి వ్యాప్తంగా ఆదివారం రాత పరీక్ష జరుగుతుందన్నారు. యానానికి సంబంధించిన 1,705 మంది అభ్యర్థులు రాత పరీక్ష రాయనున్నారు. యానాంలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలురు ఉన్నతపాఠశాల, పీఎంశ్రీ రాజీవ్ గాంధీ ప్రభుత్వ పాఠశాల, డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ పాఠశాల, మెట్టకుర్రులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రీజెన్సీ పబ్లిక్ హైస్కూల్ పాఠశాలల్లో పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 10నుంచి 12గంటలకు వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులను 8గంటల నుంచి పరీక్షా కేంద్రానికి అనుమతిస్తామన్నారు. ముఖ్యంగా అభ్యర్థుల బయోమెట్రిక్ ద్వారా అనుమతిస్తామన్నారు. 9.30గంటలు దాటితేఅనుమతించేది లేదన్నారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తో పాటు ఒక ఫొటోతో కూడిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.హాల్‌టికెట్‌లో అన్ని అంశాలు పొందుపర్చామన్నారు. పరీక్ష కేంద్రాలను ఆర్‌ఏ మునిస్వామి పరిశీలించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

మామిడికుదురు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు డిమాండ్ చేశారు. శనివారం నగరంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత 30 ఆర్టికల్‌ను రద్దుచేసి టూరిజం ప్రకటించడం వల్ల ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. రాజ్యాంగాన్ని రక్షించాలని సంవిధాన్ బచావోఅనే నినాదంతో రాష్ట్ర అధ్యక్షురాలు మే 4, 5 తేదీల్లో నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ అరీఫ్, అప్పన శ్రీరామకృష్ణ, చిట్టాల రామజోగేశ్వరరావు, బత్తుల సురేష్‌బాబు, కొండేటి వెంకటేశ్వరరావు, వానరాశి దుర్గారావు, దొరబాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి

కాట్రేనికోన, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): పెనుమల్లె(సావరం)లో అంబేడ్కర్ జయంతి శనివారం జరిగింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పాల్గొన్నారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, నాగిడి నాగేశ్వరరావు, కొల్లాటి సత్యం, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, నల్లా నరసింహమూర్తి, సర్పంచ్‌లు వంక ఏడుకొండలు, గుత్తుల సత్యనారాయణ, రంబాల రామారావు, మోకా రామారావు, గంటి సుధాకర్, ఎంపీటీసీ ధనుంజయ పాల్గొన్నారు.

స్థానిక వనరులతో ఉపాధి అవకాశాలు: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవచ్చునని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సెర్ప్, డీఆర్డీఏ అధికారులతో రాజోలు నియోజకవర్గ స్థాయిలో వెలుగు సిబ్బంది, మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే దేవ మాట్లాడారు. జిల్లాలో పర్యాటక అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటికి మహిళా సంఘాలను అనుసంధానం చేస్తే వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. మహిళలకు టూరిజం ద్వారా ఉపాధి కల్పన అంశాలపై చర్చించారు. దిండి కేంద్రంగా జిల్లాకు అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారని, వారికి మౌలిక వసతులు, స్థానిక ఆహార వంటకాలు అందించడం ద్వారా ఉపాధి పొందవచ్చునన్నారు. డీఆర్డీఏ పీడీ జయచంద్రగాంధీ మాట్లాడుతూ పర్యాటకులకు గౌడ్‌గా వ్యవహరించడంతో పాటు వచ్చిన వారికి వసతి సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆదాయం పొందవచ్చునన్నారు. సెర్ప్ అసిస్టెంట్ డైరెక్టర్ సరళి, ఏపీ టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ నాయుడు, కన్సల్టెంట్ సావిత్రీదేవిలు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రకృతి అందాలతో పాటు ఇక్కడ పండే కొబ్బరి, కోనసీమ వంటకాలను పర్యాటలకు అందించడం ద్వారా ఆదాయం పొందవచ్చునన్నారు. టెంపుల్ టూరిజం, సముద్ర బీచ్‌లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని, పర్యాటకులకు, యాత్రికులకు అందుబాటు ధరలతో వసతి, ఆహారం, గౌడ్ వంటి సేవలు అందిస్తే ఉపాధి దొరుకుతుందన్నారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఎంపీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, ఏపీఎం రాజబాబు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామికి పూజలు

మామిడికుదురు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శనివారం పురస్కరించుకుని స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేకువజామునే సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిటకిటలాడాయి. శనివారం ఒక్కరోజు స్వామివారిని 5,500మంది భక్తులు దర్శించుకుని 3 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా శనివారం రూ.3,57,034 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శ్రీమహాలక్ష్మీ అమ్మవారి జాతర మహోత్సవాలు



పి.గన్నవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరం గ్రామ దేవత శ్రీమహాలక్ష్మీ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం రాత్రి వైభవంగా జరిగాయి. 15రోజులుగా గ్రామంలోని వివిధ ఇంటిపేర్లు, సామాజిక వర్గాలు వారు రోజుకు ఒకరి చొప్పున అమ్మవారికి సేవ చేశారు. అగ్నికులక్షత్రియ సంఘం సభ్యులు రెండు రోజులు నిర్వహించే జాతరలో భాగంగా పెద్దజాగారాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. బాణసంచాకాల్పులు, గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామ ఆడపడుచులు, గ్రామస్తులు, సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కాగడాలు సమర్పించారు. గ్రామంలోని జొన్నల్లంకకు చెందిన లంకే భీమరాజు అమ్మవారికి చిన్నసైజు మూడు వెండి ఊయ్యాళ్లను అందించారు. స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సఖినేటిపల్లి వాస్తవ్యులు ముత్యాల రామానాయుడు దంపతులు అమ్మవారికి వెండి బొట్టు సమర్పించారు.

కార్యదర్శి సాయిరామ్ మృతి బాధాకరం



అమలాపురం రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల సాయిరామ్ అకాల మృతి బాధాకరమని అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు పేర్కొన్నారు. కోనసీమ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం వద్ద శనివారం పంచాయతీ కార్యదర్శుల సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. సాయిరామ్ చిత్రపటానికి డీఎల్పీవోతో పాటు పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. సాయిరామ్ చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కాకినాడ డీపీవో కార్యాలయ ఏవో నిమ్మకాయల సుబ్బారావు, ఈవోపీఆర్డీ శ్రీరామ్, అనిత, తులసి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతి

అమలాపురంరూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నడిపూడి లాకుల వద్ద గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్టు అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. శ్రీరామ్‌నగర్‌కు చెందిన సరెళ్ల సురేష్(32) బహిర్భూమికి వెళ్లి పంటకాల్వలో ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం నడిపూడి లాకుల వద్ద మృతదేహం లభ్యమైంది. అతడి బావమరిది వెంకటదుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై హెచ్‌సీ బీఎంఎం కృష్ణ కేసు దర్యాప్తు చేపట్టారు.

తెలంగాణ వాసి అదృశ్యంపై భార్య ఫిర్యాదు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన పల్యసుభాష్ (29) అదృశ్యం కావడంతో అతని భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమలాపురం పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. సంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన సుభాష్ తోటివారితో కలిసి కూలీ పనుల కోసం ఈనెల16న అమలాపురం వచ్చాడు. ఇక్కడ పనిచేయలేనని తిరిగి వెళ్లిపోతానని చెప్పడంతో 17న సహచరులు రూ.500 ఇచ్చి అమలాపురం ఆర్టీసీ బస్టాండుకు పంపించారు. ఎంతకు భర్త ఇంటికి రాకపోవడంతో భార్య సరోజ పలుచోట్ల గాలించింది. భర్త ఆచూకీ లభ్యం కాకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

అంబాజీపేట, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీపథకంలో కూలీలు వడగాల్పులకు లోనుకాకుండా పనులు చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. మాచవరం శివాలయం వద్ద జరుగుతున్న పనులు ఎంపీపీ పరిశీలించారు. మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారిసుబ్బారావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మట్టా వెంకటేశ్వరరావు, క్షేత్రసహాయకుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తొండవరంలో నేటి నుంచి యాగం

అంబాజీపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణర్థం తొండవరం గ్రామంలో శ్రీఉమాతొండేశ్వర స్వామిఆలయ సమీపంలో ఆదివారం నుంచి సర్వపృష్టపోస్త్రార్యామ యాగం నిర్వహిస్తున్నట్టు టీటీడీ ఉన్నత వేద్యాద్యేయన సంస్థ ప్రాజెక్టు అధికారి దువ్వూరి ఫణియజ్ఞేశ్వరయాజులు తెలిపారు. తొండవరంలో యాగనిర్వహణ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మే8వరకు యాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పేద పిల్లలకు ఉచిత సీట్లు

ముమ్మిడివరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 1వ తరగతిలో 25శాతం ఉచిత అడ్మిషన్లను కల్పిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారులు డి.గౌరీశంకర్, ఆర్.ఉదయభాస్కరరావులు పేర్కొన్నారు. ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద కుటుంబాల చిన్నారులకు 1వ తరగతిలో 25శాతం ఉచిత సీట్లు కేటాయిస్తామన్నారు. వీటిలో 10శాతం ఎస్సీలకు, 4శాతం ఎస్టీలకు, బీసీ, మైనార్టీ, ఇతరులకు 6శాతం, హెచ్‌ఐవీ పీడితులు, దివ్యాంగులు, అనాథలకు 5శాతం కేటాయిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44లక్షల లోపు ఆదాయ పరిమితి అన్నారు. ఏప్రిల్ 28 నుంచి మే 15వరకు అర్హులైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మే16 నుంచి 20వరకు అర్హులైన విద్యార్థులను ఎంపికచేస్తామన్నారు. మే 21నుంచి 24వరకు మొదటివిడత జాబితా లాటరీ ద్వారా ప్రకటిస్తామన్నారు. ఎంపికైన వారు జూన్2న పాఠశాలల్లో చేర్చుకుంటామని, జూన్ 6న రెండో విడత లాటరీ తీసి, జూన్12న పాఠశాలల్లో చేరుకుంటామన్నారు.

నేటి నుంచి మంచినీటి సరఫరా నిలిపివేత

ముమ్మిడివరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మెయిన్ రోడ్డులోని విష్ణాలయం సెంటర్‌లో మెయిన్ డెలివరీ పైపులైను లీకేజీ అయినందున దాని మరమ్మతుల నిమిత్తం ఈనెల 27వ తేదీ సాయంత్రం నుంచి 29వ తేదీ వరకు నగరపంచాయతీ మెయిన్ ట్యాంకు నుంచి మంచినీటి సరఫరాను నిలుపుదల చేస్తున్నామని కమిషనర్ పి.రవివర్మ తెలిపారు మరమ్మతులు పూర్తయ్యే వరకు మూడు రోజులు 4, 5, 6, 15, 17, 18, 19 వార్డుల ప్రజలకు మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వారికి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా మంచినీరు చేస్తామన్నారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి

అల్లవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రమారణకాండ హేయమైన చర్య అని జనసేన నాయకులు కంకిపాటి వీరబాబు, పిండి గణపయ్య, నల్లా రాము అన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేయాలని వారు డిమాండ్ చేశారు.

ఎస్‌హెచ్‌వోకు సన్మానం

ముమ్మిడివరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తూ బదిలీపై ఐ.పోలవరం పోలీసుస్టేషన్‌కు వెళ్లిన జి.భైరవస్వామికి శనివారం ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో సిబ్బంది భైరవస్వామిని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో హెడ్ కానిస్టేబుల్‌గా భైరవస్వామి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జాన్‌బాబు, మహిళా కానిస్టేబుల్‌లు మౌనిక, సంధ్య, టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు, గొల్లపల్లి గోపి, మోర్త ప్రసాద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనా విధానమే సమాజానికి శిరోధార్యం

రాజోలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానమే యావత్తు సమాజానికి శిరోధార్యమని తెలంగాణ రాష్ట్ర సామాజిక హక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ముప్పారం ప్రకాశం అన్నారు. శనివారం చింతలపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణంలో ప్రస్తుత సమాజానికి అంబేడ్కరిజం అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రకాశంను పూలమాలలు, దుశ్శాలువాతో సన్మానించారు. దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ, చిలకపాటి శ్రీధర్, మట్టా సురేష్‌కుమార్, చింతా శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంసిద్‌తో టాటా క్లాస్ ఎడ్జ్ ఒప్పందం
కార్యక్రమానికి హాజరైన ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావు


అమలాపురంలోని హోటల్‌లో జరిగిన సంసిద్‌టాటా ఒప్పంద కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావుతో పాటు ఆయా సంస్థల ప్రతినిధులు

అమలాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత సంసిద్ ఇంటర్నేషనల్ స్కూలు టాటా క్లాస్ ఎడ్జ్‌తో కలిసి పనిచేసేందుకు అమలాపురం కేంద్రంగా శనివారం ఒప్పందం కుదిరింది. అమలాపురంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో ఈమేరకు ఒప్పందాలు చేసుకున్నారు. సంసిద్ ఇంటర్నేషనల్ స్కూలు ఫౌండర్ చైర్మన్ వాసా శ్రీనివాసరావు ఈవిషయం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య కార్యక్రమాలను వీక్షించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో టాటా సంస్థ నుంచి ఈడీ, టాటా క్లాస్ ఎడ్జ్ లిమిటెడ్ చైర్మన్ కేఆర్ఎస్ జంపాల్, సంసిద్ గ్రూప్ చైర్మన్ వాసా శ్రీనివాసరావు, సీఈవో ఇందు సమన, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొల్వకొలను తాతాజీ, యెందూరి నాగేశ్వరరావు, సప్పా నాగేశ్వరరావు, అనేకమంది ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

అల్లవరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు ఉపాధిహామీ వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పనుల పరిశీలనలో భాగంగా కోడూరుపాడులో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. అందరికీ పని కల్పించి సమ్మర్ అలవెన్సులు పునరుద్ధరించాలన్నారు. ప్రతీ ఒక్కరికీ ప్రమాద బీమా రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. జిల్లా నాయకులు పి.శివ, విజయలక్ష్మి, లక్ష్మీకాంతం, పొలమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భర్త మృతితో పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

పి.గన్నవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛన్ పొందుతూ భర్త మృతి చెందితే మహిళలు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కేవీ ప్రసాద్ కోరారు. సంబంధిత లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వం పోర్టల్‌లో వెసులుబాటు కల్పించిందన్నారు.

ఆన్‌లైన్‌లో అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఐ.పోలవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన పులిగండ్ల వెంకటశ్రీనివాస్, వెంకటపద్మలత దంపతులు ఈనెల23న మురమళ్ల వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామి నిత్యకల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అన్నదాన భవనంలో భోజనం చేశారు. నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.వందలాది మంది భక్తుల కోలాహలంతో వీరేశ్వరుడు నిత్యకల్యాణం పచ్చతోరణంగా భాసిల్లుతున్న వైనం ఆ దంపతులను ఆకట్టుకుంది. స్పందనగా శనివారం పద్మలత నిత్యాన్నదానట్రస్టుకు ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష విరాళం అందించారు.

బాలికలను ఆదర్శంగా తీసుకోవాలి

పి.గన్నవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకుని రాబోయే కాలంలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన లాస్యప్రియ, పులిదిండి సన,సుంకర నాగచైతన్యలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయు లను, తల్లిదండ్రులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో కెవి ప్రసాద్, ఎంఈవోలు కె.హెలీనా, సీహెచ్ వీరభద్ర నందం, హెచ్ఎంలు బి.చిరంజీవిరావు, ఎ.సూర్యనారాయణరావు, బి.రాధికరాణి, జనసేనఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

రాజోలు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కడలి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల హైస్కూలు ప్లస్‌లో ఈవిద్యాసంవత్సరం 2024-25లో విద్యార్థులను చేర్పించాలని శనివారం హెచ్‌ఎంలు ఎస్ఎస్ శర్మ, విద్యా కమిటీ చైర్మన్ వడ్లమూడి ప్రకాశరావు, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కోరారు. పాఠశాల సాధించిన ఫలితాలను తల్లిదండ్రులకు వివరించారు.

అయ్యప్పను దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే

మలికిపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎత్తు వంతెన వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామివారి ఆలయానికి శనివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. గుండుబోగుల పెదకాపు, పల్లపోతు బంగారం, కటికిరెడ్డి మహేష్, అన్నంనీడి సుబ్బారావు, ఫణికృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ సమావేశం

మలికిపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పార్టీ ఆదేశాల ప్రకారం కమిటీల నియామకాలు, పార్టీ భవిష్యత్తు కోసం సమష్టిగా అందరూ పనిచేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం మలికిపురం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. నల్లి డేవిడ్, ఈద రవిరెడ్డి, కె.సతీష్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన యూటీఎఫ్

కాట్రేనికోన, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను యూటీఎఫ్ మండలశాఖ అభినందించింది. మండలంలో నెంబర్ వన్‌గా నిలిచిన కందికుప్ప విద్యార్థిని బడుగు శ్రీరక్షిత(582), గచ్చకాయలపొర హైస్కూల్ విద్యార్థి కలాడి మైథిలి(576), కాట్రేనికోన హైస్కూల్ విద్యార్థిని గుబ్బల రేవతి(573)ని వారి ఇళ్ల వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మే పేరిశెట్టి, ఎండీ అబ్దుల్‌సత్తార్, ఎన్.గోపాలకృష్ణ, పి.ఏడుకొండలు, బీఎస్ఎన్ మూర్తి, కె.రేణుకాప్రసాద్, జి.పెద్దిరాజు, వీయూఎస్ సాగర్, ఎస్కే మస్తాన్‌బాబా, పి.జగన్, సీహెచ్ రాంబాబు, బి.సతీష్, బీబీ అనంతలక్ష్మి, పి.రమేష్, వి.శ్రీనివాసరావు, బి.సత్యానందరాజు, వి.వీరభద్రరావు, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యానాంలో పుదుచ్చేరి డీఎంఎస్ పర్యటన

యానాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ వి.రవిచంద్రన్ రెండురోజుల పర్యటనకు శనివారం యానాం వచ్చారు. ఇటీవల యానాం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన రోగి సిబ్బంది నిర్లక్ష్యంతో మృతిచెందాడని బంధువులు ఆందోళన చేపట్టిన విషయం విదితమే. చేశారు. ఆసుపత్రిలో శనివారం డైరెక్టర్ విచారణ చేపట్టారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



మాచవరంలో వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రఘువీర్

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

రాయవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ సూచించారు. శనివారం మాచవరం ప్రధాన రహదారి వద్ద వాహనదారులకు ఆయన అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు ముప్పు తప్పుతుందన్నారు. ప్రత్యేకించి యువత అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల సంభవించే ప్రమాదాలపై ఆయన అవగాహన కల్పించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వద్దని, వాహనాలు నడిపే వారంతా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. డీఎస్పీ వెంట రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

కేశవస్వామి ఆలయంలో సివిల్‌కోర్టు జడ్జి పూజలు



ర్యాలి ఆలయంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి శనివారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. వేకువజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నందికొట్కూరు ప్రిన్సిపల్ సివిల్ కోర్టు జడ్జి కె.శోభారాణి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. అన్నదాన ట్రస్టుకు పలువురు భక్తులు విరాళాలు అందించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కేశవస్వామి ఆలయంలో ప్రముఖుల పూజలు: ర్యాలీ జగన్మోహని, కేశవస్వామి ఆలయంలో శనివారం రాత్రి హైకోర్టు ఎండోమెంట్ స్టాండింగ్ కౌన్సిల్ కె.కోటేశ్వరరావు, రాజమహేంద్రవరం ఫస్ట్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.జగదీశ్వరి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో రమణమూర్తి, స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. తొలుత ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు.



రాయవరంలో ఈశ్రమ్ కార్డులు పంపిణీ చేస్తున్న గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ రాంబాబు

అసంఘటిత కార్మికులకు ఈశ్రమ్ కార్డుల అందజేత

రాయవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులంతా తప్పనిసరిగా ఈశ్రమ్ నమోదు చేసుకోవాలని రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్, వార్డు మెంబరు ఉండవిల్లి రాంబాబు తెలిపారు. శనివారం రాయవరం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈశ్రమ్ నమోదుకు నిర్వహించిన గ్రామసభలు రాయవరం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ టీఎస్ కార్తీక్ ఆధ్వర్యంలో రెండో రోజు కొనసాగాయి. సభలో రాంబాబు మాట్లాడుతూ అనేక ప్రయోజనాలు కలిగిన ఈశ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తొలిరోజు నమోదు చేసుకున్న వారికి కార్డులను పంపిణీ చేశారు.

సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరంలో పలువురికి సేవలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పేరవరంలో శనివారం ఉచిత సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ముళ్ళపూడి ట్రస్టు ఆధ్వర్యం లో నిర్వహించిన శిబిరంలో 150 మందికి వైద్య సేవలు అందించారు. గోఆధారిత ప్రకృతి వ్యవసాయాదారుల సేవా సంఘం పర్యవేక్షణలో జై శ్రీరామ్ సిద్ధ ఆయుర్వేద వైద్యశాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిపుణులు కీళ్లు, మోకాళ్లు, నడుం తదితర పలు నొప్పులకు సిద్ధ ఆయుర్వేద చికిత్స ద్వారా సేవలు అందించారు. కార్యక్రమంలో ముళ్ళపూడి భాస్కరరావు, సత్యనారాయణ, మోహనరావు, రాము తదితరులు పాల్గొన్నారు.



పేరవరంలో ఆయుర్వేద వైద్యం నిర్వహిస్తున్న దృశ్యం

పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలిసిన కామన

మండపేట, ఏప్రిల్, 26(ఆంధ్రజ్యోతి): పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు శనివారం విజయవాడలో కలిశారు. విజయవాడలో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరైన ఆమెను కామన కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా రైతు సమస్యలపై పోరాడాలని ఆమె కోరారు.



విజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను సత్కరిస్తున్న దృశ్యం

గణితాన్ని ప్రకాశవంతం చేసిన రామానుజన్



రామానుజన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అకాడమీ కార్యవర్గం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గణితశాస్త్రాన్ని శ్రీనివాస రామానుజన్ వేసే ప్రతి అడుగు ప్రకాశవంతం చేసిందని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం రామానుజన్ వర్ధంతిని పురస్కరించుకుని గణిత అకాడమీలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం కార్యదర్శి ఎం.నాగార్జున మాట్లాడుతూ రామానుజన్ పరిశోధనలు సూచించే విషయాలు గణితశాస్త్ర సరిహద్దులకు అతీతమైనవి అన్నారు. సమావేశంలో రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ రచించిన జర్నీ త్రూ ది వరల్డ్ ఆఫ్ నంబర్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలుత రామానుజన్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రేవతి సైన్సు ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి, అకాడమీ సభ్యులు పీవై వెంకట్రావు, ఏ.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

సంసిద్‌తో టాటా క్లాస్ ఎడ్జ్ ఒప్పందం

హాజరైన ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత సంసిద్ ఇంటర్నేషనల్ స్కూలు టాటా క్లాస్ ఎడ్జ్‌తో కలిసి పనిచేసేందుకు అమలాపురం కేంద్రంగా శనివారం ఒప్పందం కుదిరింది. అమలాపురంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో ఈమేరకు ఒప్పందాలు చేసుకున్నారు. సంసిద్ ఇంటర్నేషనల్ స్కూలు ఫౌండర్ చైర్మన్ వాసా శ్రీనివాసరావు ఈవిషయం తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య కార్యక్రమాలను వీక్షించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో టాటా సంస్థ నుంచి ఈడీ, టాటా క్లాస్ ఎడ్జ్ లిమిటెడ్ చైర్మన్ కేఆర్ఎస్ జంపాల్, సంసిద్ గ్రూప్ చైర్మన్ వాసా శ్రీనివాసరావు, సీఈవో ఇందు సమన, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొల్లకొలను తాతాజీ, యెందూరి నాగేశ్వరరావు, సప్పా నాగేశ్వరరావు, అనేకమంది ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.

సమస్యల చెరలో రైతుబజార్

• కొరవడిన అధికారుల అజమాయిషీ • అరకొర సౌకర్యాలతో వినియోగదారులకు తప్పని పాట్లు



మండపేటలో వున్న రైతుబజార్

మండపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) మండపేట గాంధీనగర్‌లో వున్న రైతుబజార్ సమస్యల చెరలో కొట్టుమిట్టాడుతోంది. ఈ బజారుపై ప్రభుత్వ అజమాయిషీ లేదన్న ఆరోపణలున్నాయి. కూరగాయలు కొనుగోలు చేసుకునేందుకు వచ్చే వినియోగదారులు, వ్యాపారులు వాహనాలను బజార్ బయట పెట్టుకోవల్సి ఉండగా బజారులోపల పార్కింగ్‌తో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. రైతుబజార్‌ను పర్యవేక్షించాల్సిన ఎస్టేట్ అధికారి మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సూచిక బోర్డు మీద ధరలను కూడా తామే రాయాల్సి వస్తోందని పలు వురు వ్యాపారులు వాపోతు న్నారు. రైతు బజారు లోపల భాగాన్ని పలువురు వ్యాపారులు ఆక్రమించుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు పలువురు ఆరోపిస్తున్నారు. దాహం వేస్తే తాగేందుకు మంచి నీళ్లు కూడా ఉండటం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడున్న వాటర్ ప్లాంట్ మూలనపడినా దాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇక్కడున్న రైతుబజారు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. బజారులో శుభ్రత లేకపోవటం, సరుకుల్లో నాణ్యత తగ్గడం, ప్రభుత్వ అజమాయిషీ లేకపోవటం వంటి పలు పరిణామాల మధ్య ఇక్కడి రైతుబజారు వేదికగా మారిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ తిష్టవేసిన సమస్యలను పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని అధికార యంత్రాంగాన్ని వినియోగదారులు, స్థానికులు కోరుతున్నారు.



రైతుబజారులో మూలకు చేరిన వాటర్ ప్లాంట్, పరికరాలు

అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని శనివారం కాకినాడకు చెందిన చిట్టూరి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. అన్నప్రసాద ట్రస్టుకు రూ.10,116 విరాళం అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.



అక్రమ మద్యాన్ని సీజ్ చేసిన పోలీసులు

వానపల్లిలో 110 బాటిళ్ల మద్యం సీజ్

కొత్తపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వానపల్లి రామ్మోహనరావుపేటలో అక్రమ మద్యాన్ని అమ్ముతున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. దాడి సమయంలో నిర్వాహకుడు కుంచే రమేష్ పరారవ్వగా 110 బాటిళ్ల అక్రమ మద్యంతో పాటు సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సురేంద్ర తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.20వేలు ఉంటుందని సీఐ విద్యాసాగర్ తెలిపారు.

ఘనంగా పుంతలో ముసలమ్మ జాతర

రాయవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామస్తుల ఇలవేల్పు పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, హారతులు నిర్వహించారు. ఆదివారం చైత్రమాసం అమావాస్యను పురస్కరించుకుని తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి తీర్థాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు మొక్కులు చెల్లించుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ద్వారా 2025-26 సంవత్సరానికి అన్ని ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించినట్లు ఎంఈవో కె.తాతారావు తెలిపారు. వీటి ప్రవేశాలకు 5 ఏళ్లు నిండిన చిన్నారులు ఈనెల 28 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ సమాచారాన్ని తెలియజేస్తున్నామన్నారు. సచివాలయంలో అర్హులైన వారు దరఖాస్తులు ఆన్‌లైన్ చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కె.గంగవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద వర్గాల విద్యార్థులు 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాశాఖ మండల అధికారి ఏ.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు అన్ని వివరాలతో ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఏప్రిల్ 28 నుంచి మే 15 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు సమయం ఉందన్నారు. మే 16న లాటరీ ద్వారా విద్యార్థులకు పాఠశాలలు కేటాయిస్తామని ఆయన తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

ద్రాక్షారామ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం కోటాలో అడ్మిషన్లుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు వీరరాఘవరెడ్డి, నాగేశ్వరి కోరారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 28 నుంచి మే 15 వరకు పుట్టిన తేదీ, ఆధార్‌కార్డులతో 1వ తరగతిలో ప్రవేశానికి గ్రామ సచివాలయం, మీ సేవ కేంద్రం లేదా ఇంటర్‌నెట్ సెంటర్ల ద్వారా సీఎస్‌సీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

28న మోడరన్ మోడల్ పాలిసెట్ పరీక్ష

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మోడరన్ విద్యా సంస్థలో ఈ నెల 28న ఉదయం 9 గంటలకు మోడల్ పాలిసెట్ నిర్వహిస్తున్నట్లు సంస్థల అధినేత లయన్ జీవీ రావు తెలిపారు. పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, నగదు అందజేస్తామన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు కళాశాల వద్దకు వచ్చి నేరుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈనెల 30న జరిగే ఈ పరీక్ష ప్రభుత్వ పాలిసెట్ పరీక్షకు ఉపయోగపడుతుందన్నారు.

జమాతే ఇస్లామిశాఖ అధ్యక్షుడిగా ఫారుఖ్‌ఆలీ



మండపేట, ఏప్రిల్, 26 (ఆంధ్రజ్యోతి): మండపేట జమాతే ఇస్లామీ నూతన అధ్యక్షుడిగా జనాబ్ ఫారుఖ్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం జరిగిన సంస్థాగత ఎన్నికల్లో ఆయన నూతన అధ్యక్షుడిగా సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్ర మంలో జమాతే సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర ప్రభుత్వ అంచనాల కమిటీ రాష్ట్ర చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మండపేట ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ అంచనాల కమిటీ రాష్ట్ర చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. చౌడేశ్వరస్వామి కల్యాణ మండపంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి చేనేత సొసైటీ సహకార సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. చేనేత సంఘ ప్రతినిధి, మున్సిపల్ కౌన్సిలర్ కాశిన కాశీవిశ్వనాథం అధ్యక్షతన సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేగుళ్లకు చేనేత సంఘాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలిపారు. చేనేత సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడానని ఇప్పుడు మరోసారి చేనేత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. సమావేశంలో చేనేత సంఘాల ప్రతినిధులు, ఆప్కో మాజీ సభ్యుడు ముప్పన వీర్రాజు, డీసీసీబీ మాజీ సభ్యుడు చింతా వీరభద్రేశ్వరరావు, అంకం వీర్రాజు, మండపేట చేనేత కార్యదర్శి వెదుళ్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవికి ఎమ్మెల్యే పూజలు: మండపేటలోని బూరుగుంట చెరువున ఉన్న అన్నపూర్ణాదేవిని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల శనివారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ఆయన పూజలు చేసి ప్రసాదాలను స్వీకరించారు.



పరిష్కార వేదికలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే వేగుళ్ల

ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక: టీడీపీ పట్టణ కార్యాలయంలో శనివారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ వేదికలో ఆయన పలు గ్రామాల నుంచి వచ్చిన వారి అర్జీలను తీసుకున్నారు. విద్యుత్ మీటర్లు డబుల్ ఎంట్రీలపై మూడు ఫిర్యాదులు, సీసీ డ్రైన్ కోసం ఒకటి, రాయవరం మండలంలో రహదారులు నిర్మించాలని, టిడ్కో గృహాల వద్ద మురుగునీరు దిగటం లేదని ఫిర్యాదులు వచ్చాయి. ఆయా సమస్యల పరిష్కారానికి చర్య లు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే వేగుళ్ల ఆదేశించారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే: టెన్త్ ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన గౌతమి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే వేగుళ్ల శనివారం అభినందించారు. టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన్ను కలిశారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు సలా దీక్షిత, నీలం వైష్ణవి, వాసా సిరిలక్ష్మిలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వల్లూరి సూర్యలత, కె.దుర్గాదేవి తదితరులు వున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ: ఇటీవల అనారోగ్యంపాలై పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల శనివారం బాధితులకు అందించారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 19 మందికి మంజూరైన రూ.13,86,093 చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉంగరాల రాంబాబు, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో మానవహారం నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు

ఉగ్రదాడికి సీఐటీయూ నిరసన...మానవహారం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తుల ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పాత బస్టాండు సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ జరిపారు. మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ మానవహారం నిర్వహించి నిమిషం పాటు మౌనం పాటించారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, మండల కన్వీనర్ ఎం.దుర్గమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎం. సుభాషిణి, ఆశవర్కర్ల సంఘం నాయకులు సూర్యకుమారి, లక్ష్మీదుర్గ, పద్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు మారుతి సెంటర్ నుంచి పాతబస్టాండ్ సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కృష్ణారావు, శ్రీకాకుళపు బాబి, యొండూరి పవన్‌కుమార్, రాధాకృష్ణ, సాయి ప్రసాద్, లింగేశ్వరరావు, చినబాబు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6 వరకు పాఠశాల విద్యార్థులకు నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయాధికారిణి డి.శివకుమారి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ప్రతీరోజూ ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యార్థులకు కథలు చెప్పడం, చదవడం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, సంగీతం తదితర అంశాలతో శిక్షణ ఇస్తామన్నారు.

తెలంగాణ వాసి అదృశ్యంపై భార్య ఫిర్యాదు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన పల్యసుభాష్ (29) అదృశ్యం కావడంతో అతని భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమలాపురం పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. సంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన సుభాష్ తోటివారితో కలిసి కూలీ పనుల కోసం ఈనెల16న అమలాపురం వచ్చాడు. ఇక్కడ పనిచేయలేనని తిరిగి వెళ్లిపోతానని చెప్పడంతో 17న సహచరులు రూ.500 ఇచ్చి అమలాపురం ఆర్టీసీ బస్టాండుకు పంపించారు. ఎంతకు భర్త ఇంటికి రాకపోవడంతో భార్య సరోజ పలుచోట్ల గాలించింది. భర్త ఆచూకీ లభ్యం కాకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ప్రభుత్వ స్థలాల్లో పక్కా భవనాలు..రేకు షెడ్ల నిర్మాణం



రావులపాలెం రింగ్‌రోడ్డులో రహదారిపై నిర్మించిన రేకుల షెడ్లు

రావులపాలెం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సెంటర్‌లో పలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి పక్కా భవనాలు నిర్మించినా అధికారులు వాటికేసి కన్నెత్తి కూడా చూడకపోవడం పలు విమర్శలకు దారితీస్తున్నది. దీంతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోయి రహదారులను ఆక్రమించి షెడ్లు నిర్మించుకున్నా అధికారులు చోద్యం చూడటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో వ్యాపార సముదాయాలు పెరగడంతో దుకాణాలకు వచ్చేవారి సంఖ్య భారీగా పెరిగింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు స్థానిక పెద్ద అంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి అమలాపురం రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయం వరకూ కోనసీమ ముఖద్వారానికి ఇరువైపులా కోట్లాది రూపాయలతో రింగు రోడ్డును నిర్మించారు. రహదారి నిర్మాణంలో ఆక్రమణల తొలగింపునకు పలు అడ్డంకులు రావడంతో అరకొరకగా తొలగింపులు చేసి రింగురోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారని అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి. రింగు రోడ్డు నిర్మాణం అనంతరం దాని పొడవునా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రేకుషెడ్లు, బడ్డీలు, ప్లాట్‌ఫారాలు నిర్మించి వాటిని అద్దెలకు ఇచ్చి సొమ్ములు చేసుకుంటున్నారని పలువురు ఆరోపి స్తున్నారు. ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్రమణల వైపు చూడని అధికారులు: రింగ్ రోడ్డు మీదుగా ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం విధులు నిర్వర్తించేందుకు వెళ్లే అధికారులు రహదారి పొడవునా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు, షెడ్లు చేపట్టినా అధికారులు వాటివైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. ఆయా ఆక్రమణలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు స్పందించే పరిస్థితి లేదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో గ్రామానికి చెందిన ఒకవ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు నిర్మించడంతో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై నివేదిక ఇవ్వాల్సిదింగా లోకయుక్త కోరడంతో వారి ఆదేశాల మేరకు రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు. అనంతరం రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అరకొరకగా ఆక్రమణలు తొలగించి పూర్తిస్థాయిలో వాటిని తొలగించామంటూ ప్రచారం చేసుకున్నారు.

ఇలా తొలగించారు....అలా నిర్మించారు: లోకాయుక్త ఆదేశాల మేరకు సర్వే నిర్వహించి మొక్కుబడి తంతుగా అధికారులు ఎక్స్‌వేటర్ సాయంతో తూతుమంత్రంగా అప్పట్లో తొలగింపు చర్యలు పూర్తి చేశారు. అధికారులు ఆక్రమణలను తొలగించిన కొంతకాలానికే భవన యజమానులు మరలా యధావిధిగా రింగ్ రోడ్డును ఆక్రమించి ప్లాట్‌ఫారాలు, రేకుషెడ్లు, నిర్మాణాలు చేపట్టి వాటిని అద్దెలకు ఇస్తూ సొమ్ములు చేసుకుంటున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.